ప్రజాశక్తి

సోమవారం 17 జులై 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

అమ్మఒడి.. ఎప్పుడూ జమయ్యేది..?

- సిఎం బటన్ నొక్కి 18 రోజులైనా జమవ్వని సొమ్ము
- బ్యాంకుల చుట్టూ మహిళల ప్రదక్షిణలు
- కారణాలపైనా సరైన సమాధానం దొరక్క గందరగోళం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

జగనన్న అమ్మఒడిలో అర్హతున్నా ఎంతో మంది ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.13 వేల ఆర్థిక సాయం పొందలేకపోయారు. గుంటూరు జిల్లాలో 1,59,594 మంది, పల్నాడు జిల్లాలో 1,87,417 మంది తల్లుల ఖాతాల్లో రూ.13 వేలు చొప్పున నిధులు జమైనట్లు అధికారులు ప్రకటించారు. కానీ గతనెల 28 నుంచి ఈనెల 15 వరకు తల్లుల ఖాతాల్లో దశల వారీగా రూ.13 వేలు చొప్పున సొమ్ము జమ అవుతూనే ఉంది. గతంలో సిఎం బటన్ నొక్కి ప్రారంభించిన తరువాత నాలుగు రోజుల్లో లబ్ధిదారుల ఖాతాల్లో సొమ్ము జమయ్యేది. ఈసారి 18 రోజుల సమయం తీసుకున్నారు. కానీ క్షేత్రస్థాయిలో గుంటూరు జిల్లాలో 12 వేల మందికి, పల్నాడు జిల్లాలో 18 వేల మందికి ఇంత వరకు అమ్మఒడి నిధులు



జమకాలేదని తెలిసింది. వీరు బ్యాంకుల చుట్టూ గత 17 రోజులుగా ప్రదక్షిణాలు చేస్తున్నారు. కారణం ఏమిటో చెప్పడానికి ఏస్థాయిలోనూ ఎవరూ కచ్చితమైన సమాధానం చెప్పడంలేదని విద్యార్థుల తల్లులు వాపోతున్నారు.

గతనెల 28న సిఎం జగన్ విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేశారు. ఈనెల 16లోగా బ్యాంకు ఖాతాల్లో జమ కాకపోతే ఆయా సచివాలయాల పరిధిలోని విద్యాశాఖ కార్యదర్శులను సంప్రదించాలని అధికారులు తెలిపారు. ఇకెవైసి సమస్య వల్ల నాలుగు వేలమంది వరకు అమ్మఒడి సాధించలేక పోయారు. బ్యాంకుల్లో ఆధార్ అనుసంధానం కాలేదని అర్హత సాధించిన జాబితాలో కూడా వందలాది మందిని ఇన్ యాక్టివ్ పేరుతో చూపారు. మూడేళ్లుగా తమ బ్యాంకు ఖాతాకు అమ్మఒడి జమ కాగా ఈ ఏడాది మాత్రం ఆధార్ అనుసంధానం కాలేదని చెబుతూ నిలిపివేయడంపై వేలాదిమంది తల్లులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అదే బ్యాంకు ఖాతాతో తాము ఏడాదిగా లావాదేవీలు నిర్వహిస్తున్నా, ఇతర ప్రభుత్వ పథకాలు అందుతున్నా అమ్మఒడి నిధులు జమకాకపోవడానికి బ్యాంకుకు ఆధార్ అనుసంధానం కాకపోవడాన్ని కారణంగా చూపడంపై విడ్డూరంగా ఉందని చెబుతున్నారు. బ్యాంకు ఆధార్ అనుసంధానంలో కొత్తగా నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాతో (ఎన్‌పిసిఐ) లింకు చేయించుకోవాలని తాజాగా సచివాలయాల సిబ్బంది చెబుతున్నారు. అయితే అధికారుల సూచన మేరకు మళ్లీ బ్యాంకుల చుట్టూ తిరిగి ఆధార్ అనుసంధానం చేసినా సొమ్ము జమకాలేదని పలువురు మహిళలు వాపోతున్నారు. వీటిపై వాలంటీర్లకు అడుగుతున్నా వారు తమకు సంబంధం లేదని చెబుతున్నారని అంటున్నారు.

పట్టణ ప్రాంతాల్లో వెయ్యి అడుగులకు పైగా నివాసం ఉంటే అనర్హతగా చూపారు. అంటే వెయ్యి అడుగుల్లో అపార్టుమెంట్ వున్న వారికి అమ్మఒడి వర్తించదని సచివాలయాల సిబ్బంది చెబుతున్నారు. విద్యాశాఖతో సంబంధం లేకుండా కేవలం గ్రామ, వార్డు సచివాలయాలకు బాధ్యతలు అప్పగించడం వల్ల విద్యాశాఖ అధికారులు ఈ అంశం తమకు సంబంధం లేదంటున్నారు. రైస్ కార్డు ఉన్నా ఏదో ఒక సాకుతో ▶ 2లో



జెండాలు పట్టుకుని పొలాలకు ప్రదర్శనగా వెళ్తున్న బాధిత దళితులు, నాయకులు

భూ పోరుకు మరోసారి కదిలిన ఊరు

- యడవల్లి భూముల్లో సాగుకు సిద్ధమైన దళితులు
- దుక్కి దున్ని జొన్న విత్తనాలు సాగు
- న్యాయం చేసేదాక వ్యవసాయం చేస్తామని ఉద్ఘాటన

ప్రజాశక్తి - చిలకలూరిపేట

భూములు కోల్పోయిన తమకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలూ లేక పస్తులుంటున్నామని యడవల్లి దళిత రైతులు ఆవేదనకు గురవుతున్నారు. ఉపాధి హామీ పనులనూ చూపకపోవడంతో వలసవెళ్లాల్సిన దుస్థితి నెలకొందని, ఆ ప్రాంతాల్లోనూ పనులు సరిగా దొరగడం లేదని వాపోయారు. ప్రభుత్వం తమ వద్ద గ్రానైట్ పేరుతో తీసుకున్న భూములకు పరిహారంగా మరోచోట భూములివ్వాలని, లేదా సరైన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకూ తమ భూములను తామే సాగుచేసుకుంటామని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆ భూముల్లో సాగుకు సిద్ధమై ఆదివారం దుక్కులు దున్ని విత్తనాలేశారు. వీరికి వ్యవసాయ కార్మిక సంఘం, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్), ఎంఆర్‌పిఎస్ అండగా నిలిచాయి. ఈ సందర్భంగా కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ దళితుల భూములను లాక్కోవడానికి లిఫ్ట్ ఇరిగేషన్‌కు విద్యుత్ సరఫరాను నిలిపేశారని, సొసైటీ రద్దు చేశారని మండిపడ్డారు. కనీసం భూసేకరణ చట్టం ప్రకారమైనా పరిహారం ఇవ్వాలని తహశీల్దార్, ఆర్‌డిఒ, కలెక్టర్ కార్యాలయాల్లో విన్నవించినా ▶ 2లో



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

జిఒ 117ని రద్దు చేయాలి

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-గుంటూరు

గతేడాది 3, 4, 5 తరగుతల విలీనానికి గురైన ప్రాథమిక పాఠశాలలు తల్లిదండ్రుల ఆదరణకు దూరమై త్వరలో మూతపడేందుకు సిద్ధంగా ఉన్నాయని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు ఆందోళన వెలిబుచ్చారు. ఆయా ప్రాథమిక పాఠశాలల్లో పిల్లల్ని చేర్చడానికి తల్లిదండ్రులు ఇష్టపడక ప్రైవేటు పాఠశాలల్లో చేరుతున్నారని, తక్షణమే జిఒ 117ని రద్దు చేసి ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి అయిదు తరగతులు కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు బి.ఆదిలక్ష్మి అధ్యక్షతన ఆదివారం యుటిఎఫ్ జిల్లా ఆఫీసు బేరర్స్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు తగ్గటానికి ప్రభుత్వ విధానాలే కారణమని చెప్పారు. పిల్లలు ప్రభుత్వ పాఠశాలకు దూరమై ప్రైవేటు పాఠశాలల్లో చేరుతుంటే ▶ 2లో

ఓట్ల రాజకీయం ప్రారంభం 8లో



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు

ఇళ్ల నిర్మాణానికి 24న సిఎం శంకుస్థాపన

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు జిల్లా, ఎన్‌టిఆర్ జిల్లాలకు సంబంధించిన 47 వేల మందికి ఇళ్ల మంజూరు ఉత్తర్వుల పంపిణీ, కృష్ణాయపాలెంలో జగనన్న లేఅవుట్లకు శంకుస్థాపన కార్యక్రమాల్లో ఈనెల 24న రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి పాల్గొంటారని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి చెప్పారు. ఏర్పాట్లలో అధికారులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. ఈ మేరకు సిఎం పర్యటన ఏర్పాట్లపై రాజధాని పరిధిలోని లే అవుట్ల ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులతో కలెక్టరేట్‌లో ఆదివారం సమీక్షించారు. రాజధాని పరిధిలోని 25 లే అవుట్లలోని 47 ▶ 2లో

విద్యా ప్రమాణాల కోసం ప్రణాళిక

- పదో తరగతిలో ఉత్తమ ఫలితాల కోసం ప్రత్యేక దృష్టి
- ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలల్లో ఫీజు దోపిడీపై ఆధారాలు సహా ఫిర్యాదులొస్తే కఠిన చర్యలు : ప్రజాశక్తితో పల్నాడు డిఇఒ

8లో



మాట్లాడుతున్న రమాదేవి

9న విజయవాడలో మహాధర్నా

ప్రజాశక్తి-గుంటూరు

క్విట్ ఇండియా స్ఫూర్తితో కార్మికుల హక్కుల కోసం విజయవాడలో ఆగస్టు 9న జరిగే మహాధర్నాను, ఈనెల 25న పాతగుంటూరులోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆలిండియా ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో జరిగే జిల్లా సదస్సును విజయవంతం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు సిఐటియు జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ బిజెపి 9 ఏళ్ల పాలనాకాలంలో కార్మికవర్గంపై తీవ్రమైన దాడి చేస్తుందన్నారు. లేబర్ కోడ్ తీసుకురావటం ద్వారా కార్మికులు కనీసం యూనియన్ పెట్టుకునే హక్కును కోల్పొతారన్నారు. ప్రభుత్వ రంగం మొత్తం ప్రైవేటీకరణ చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంబానీ, అదానీ సేవలో ఉంటూ కార్మిక హక్కులు కాలరాస్తూ తీవ్రదాడి చేస్తోందన్నారు. కార్మిక వర్గాన్ని దోపిడీ చేస్తున్నారన్నారు. ఈ విధానాలు ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో కేంద్ర కార్మిక ▶ 2లో

మొదటి పేజీ తరువాయి

అమ్మఒడి.. ఎప్పుడూ జమయ్యేది..?

అనర్హత కల్పించారని పలువురు చెబుతున్నారు. విద్యుత్ బిల్లులు 300 యూనిట్లు దాటినా, రేషన్ కార్డులో పిల్లలకు ఇకెవైసి పూర్తి కాకపోయినా, మూడెకరాల మాగాణి భూమి తల్లిదండ్రులకు ఉన్నా, 75 శాతం హాజరు లేకపోయినా, నాలుగు చక్రాల వాహనం, ఐటి, జిఎస్‌టి రిటర్నులున్నా అనర్హులుగా నిర్ధారించారు. వీటిల్లో కొన్ని అంశాలకు సంబంధిత తల్లిదండ్రులు తగిన ఆధార్‌లతో వివరణ ఇచ్చినా అవకాశం దక్కలేదు. బ్యాంకు లింకేజి సమస్య పరిష్కరించుకున్నా వారికీ సొమ్ము జమకాలేదు. ప్రభుత్వం విడుదల చేసిన అర్హత జాబితాల ప్రకారం గతనెల 24 నుంచి 27 మధ్య వాలంటీర్లు తల్లుల నుంచి బయోమెట్రిక్ తీసుకున్నారని వీరందరికి అమ్మఒడి నిధులు జమ అవుతాయని రాని వారు తప్పని సరిగా సచివాలయం విద్యాశాఖ కార్యదర్శికి తమ వివరాలు సమర్పించాలని గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి తెలిపారు.

జిఒ 117ని రద్దు చేయాలి

ప్రభుత్వం వేలకోట్లు నాడు-నేడుకు ఖర్చు చేసి ప్రయోజనం ఏంటని ప్రశ్నించారు. ఉపాధ్యాయులపై అనవసరమైన ఒత్తిడి చేస్తూ, బెదిరించటం వల్ల విద్యారంగంలో మెరుగైన ఫలితాలు రావని అధికారులు తెలుసుకోవాలన్నారు. ఇప్పటికైనా విద్యావేత్తలతో, మేధావులు, ఎమ్మెల్సీలు, సంఘాలతో చర్చించి, ఉపాధ్యాయుల్ని ప్రోత్సహిస్తూ వారిని భాగస్వాముల్ని చేయటం ద్వారా ప్రభుత్వ విద్యారంగం మెరుగుపడుతుందని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర బాధ్యతల భారం విపరీతంగా పెరిగిపోయిందని, దీని ప్రభావం బోధనపై పడి పిల్లలకు నష్టం జరుగుతుందని అన్నారు. బోధనేతర పనులను, అనవసరమైన శిక్షలను గందరగోళ విద్యా కార్యక్రమాలను రద్దుచేసి, స్పష్టమైన విద్యా విధానాన్ని రూపొందించి, ఉపాధ్యాయులను బోధనకు పరిమితం చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర సహాధ్యక్షులు ఎ.ఎస్.కుసుమకుమారి, ఐక్య ఉపాధ్యా పత్రిక సంపాదకులు ఎస్.కుమార్‌రాజా, రాష్ట్ర ప్రచురణల కమిటీ ఎం.హనుమంతరావు, జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, ఎఎల్.శివపార్వతి, ఎమ్‌డి దౌలా పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి 24న సిఎం శంకుస్థాపన

వేల మంది లబ్దిదారులకు జగనన్న ఇళ్ల మంజూరు ఉత్తర్వుల పంపిణీ, లే అవుట్లలోని ఇళ్లకు భూమి పూజ, ఇటుకల తయారీ యూనిట్, పైలాన్ ప్రారంభోత్సవం సందర్భంగా వెంకటపాలెంలో జరిగే బహిరంగ సభ కార్యక్రమంలో సిఎం పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో పాల్గొనే లబ్దిదారులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను చేపట్టాలన్నారు. వాహనాల పార్కింగ్, బారికేడ్ల ఏర్పాట్లు, తాగునీరు, స్నాక్స్, టాయిలెట్లు, పారిశుధ్య ఏర్పాట్లు, నిరంతర విద్యుత్ సరఫర ఉండేటట్లు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీలు తలసిల రఘురామ్, లేళ్ళ అప్పిరెడ్డి, మురుగుడు హనుమంతరావు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్‌రావు, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, గుంటూరు నగర మేయర్ కావటి శివనాగ మనోహర నాయుడు, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, ఎన్‌టిఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్, విజయవాడ సబ్ కలెక్టర్ అధితి సింగ్, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, విజయవాడ నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సిఆర్‌డిఎ అడిషనల్ కమిషనర్ అలీమ్ భాష, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్, డిఆర్‌ఒ కె.చంద్రశేఖర్‌రావు, ఎంటిఎంసి కమిషనర్ శారదాదేవి, ఆర్‌డిఓ ప్రభాకర్‌రెడ్డి, అడిషనల్ ఎస్‌పి శ్రీనివాసరావు, హౌసింగ్ పీడీ వేణుగోపాల్ పాల్గొన్నారు.

9న విజయవాడలో మహాధర్నా

సంఘాలన్నీ పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ విధానాలు విరమించుకోవాలని లేకపోతే జరుగు పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని అన్నారు. సమావేశంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్, జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ, నాయకులు ఎం.సాంబశివరావు, బి.ముత్యాలరావు, ఎన్.శివాజీ, వి.దుర్గారావు, షేక్.హుస్సేన్‌వలి, ఎన్.రమాసుమ్మ, ఎం.భాగ్యరాజ్, ఎన్.రమేష్, టి.రాధ, వెంగమ్మ, బి.సత్యనారాయణ, ఎస్ఎం.వలి, బాషా, నాగరాజు, ఎం.రవి పాల్గొన్నారు.

భూ పోరుకు మరోసారి కదిలిన ఊరు

(మొదటి పేజీ తరువాయి)

పట్టించుకోలేదని గుర్తు చేశారు. అత్తెసరు పరిహారంతో సరిపెట్టారని, దళిత ఒంటరి మహిళలను మోసం చేసి ఆ కొద్దిపాటి పరిహారాన్ని కూడా రవీంద్ర, రాంబాబు కాజేశారని, వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.శివనాగరాణి, పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జి.రవిబాబు మాట్లాడుతూ పేదలు, అందునా దళితులు కాబట్టే ఏం చేసినా అడిగేవారుండరని ప్రభుత్వం, అధికారులు తీవ్ర అన్యాయం చేశారని అన్నారు. బాధితులకు అండగా తామంతా పోరాడతామని చెప్పారు. గతంలో టిడిపి ప్రభుత్వం ఈ భూములను తీసుకోవడానికి యత్నించగా దళితులు పోరాడారని, ప్రతిపక్ష నేతగా ఆ ఉద్యమానికి జగన్ మద్దతిచ్చారని గుర్తు చేశారు. అయితే అధికారంలోకి వచ్చాక హామీలను విస్మరించి భూములను లాక్కున్నారని మండిపడ్డారు. బాధితులకు న్యాయం జరిగేదాక పోరాడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు నాయకులు ఎం.విల్సన్, ఫైరోజ్, ఎంఆర్‌పిఎస్ పల్నాడు జిల్లా కన్వీనర్ ఎ.బాబు పట్టణ అధ్యక్షులు కె.కుమార్, దళితులు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

సిఎం, మంత్రి మాట తప్పారు

మట్టుకొమ్మ యాకోబు, వేల్పుల వేములమ్మ, కాకాని రోశయ్య

మట్టుకొమ్మ యాకోబు పొలాన్ని వేల్పుల యాకోబ్‌గా మార్పు చేసి పరిహారాన్ని కాజేశారు. దీనిపై తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదు. భూమిపోయి పనుల్లేక పస్తులుంటున్నాం. ఇక్కడ పనులు దొరక్క ఇతర ప్రాంతాలకు వలసెళ్లాల్సి వస్తోంది. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, స్థానిక మంత్రి విడుదల రజని మాకు తీవ్రంగా అన్యాయం చేశారు. పట్టాలిస్తామని ఎన్నికలకు ముందు చెప్పిన వారు తర్వాత మాట తప్పారు. వివిధ సంఘాల అండతో దీర్ఘకాలికంగా పోరాడుతున్నా మా గోడును పట్టించుకోవడం లేదు.





మితాహారంతో ఆరోగ్యం మనచేతుల్లోనే

ప్రజాశక్తి-గుంటూరు

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో ఆరోగ్య సభ నిర్వహించగా ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ ఎస్.కుమారవేలు ప్రధాన వక్తగా మాట్లాడారు. నరాల సమస్యలు, నరాలు దెబ్బతినటం వల్ల ఇబ్బందుల గురించి తెలియజేస్తూ రక్తాన్ని వివిధ అవయవాలకు రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళాలకు బ్లాక్‌లు ఏర్పడితే రక్త సరఫరాకు అంతరాయం ఏర్పడి అవయవాలు దెబ్బతిని అనారోగ్యానికి గురవుతారని తెలిపారు. మనం చేసే పనిని బట్టి ఆహారాన్ని తీసుకోవాలని, పిల్లలు, బరువు పనులు చేసే వారు, గర్భిణులు కొంచెం ఎక్కువగా ఆహారం తీసుకోవాలని, మిగిలిన వారు తగు మోతాదులో తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. లేకుంటే శరీరంలో కొవ్వు పెరుగుతుందన్నారు. పీచుపదార్ధం ఎక్కువగా ఉన్న ఆహారాన్ని తీసుకుంటూ వీలైతె రోజుకు ఒకసారి ఉడికిన ఆహారం, రెండోపూట పండ్లు తీసుకుంటే మంచిదని చెప్పారు. ఆహార నియంత్రణలోనే ఆరోగ్యం ఉందని, మనం ఇష్టానుసారం ఆహారం తీసుకొని ఆరోగ్యం బాగుండాలని భావిస్తే కుదరదని సూచించారు. మెదడుకు రక్త ప్రసరణ సరిగా లేకపోతే బ్రెయిన్ స్ట్రోక్ సమస్య ఉత్పన్నం అవుతుందన్నారు. మూతి వంకర పోవడం, చేతులు, కాళ్లు చచ్చు పడటం, ఉన్నట్లుండి మాట నంగిగా రావడం స్ట్రోక్ లక్షణాలు అని, అవి కనపడిన 4.1/2 గంటలలోగా వైద్యం అందాలని ఆకాల వ్యవధిని గోల్డెన్ అవర్ అని అంటారని తెలిపారు. పోషకాహారం తీసుకుంటూ, మద్యపానం, ధూమపానం చేయకుండా, బరువును అదుపులో ఉంచుకొని, వ్యాయామం చేస్తూ, మంచి వాతావరణంలో ఉంటూ, మధుమేహం, రక్తపోటు అదుపులో ఉంచుకుంటే బ్రెయిన్ స్ట్రోక్‌ను నివారించొచ్చని వివరించారు. మెడనొప్పి గురించి మాట్లాడుతూ మెడలో వెర్టిబ్రా దెబ్బతిన్నా కండరం దెబ్బతిన్నా మెడనొప్పి వస్తుందని, మెడలో వెర్టిబ్రా అరగటం వల్ల స్పాండిలోసిస్ అనే సమస్య ఉత్పన్నం అవుతుందన్నారు. కూర్చునే భంగిమ వల్ల కూడా మెడనొప్పి వస్తుందని, మెడ అనుకునే విధంగా కూర్చోవాలని, నిటారుగా కూర్చోవాలని కంప్యూటర్ వర్క్ చేసే వారు తలెత్తకుండా కనబడే ఎత్తులో కూర్చోవాలని సూచించారు. సెల్‌ఫోన్ ఉపయోగించేటప్పుడు కూడా తలెత్తే పని లేకుండా చేసేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు. నరాలు దెబ్బతింటే తిమ్మిరి, చురుకులు రావడం, చేతులు పటుత్వం తగ్గడం, కాళ్ల చెప్పులు వేసుకున్నది లేనిది తెలియకపోవడం, మూతి వంకర పోవడం, నీరు తాగేటప్పుడు నీరు బయటకు రావడం జరుగుతుందన్నారు. నరాలు దెబ్బతింటే చేతులు వణుకు, సయాటీకా, మూర్ఛ వ్యాధి, నీరసం, కళ్లు తిరగడం సమస్యలు వస్తాయని చెప్పారు. సమావేశంలో ఎంవిఎస్ ప్రసాద్, నారపరెడ్డి, సిహెచ్.అంజిరెడ్డి, టివి సాయిరాం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ కుమారవేలు

జిజిహెచ్‌లో వార్డుల తనిఖీ

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ ఆదివారం పలు వార్డులను తనిఖీ చేశారు. ప్రస్తుతం జనరల్ సర్జరీ విభాగం అధిపతి డాక్టర్ పద్మశ్రీ కాలికి గాయం కావడంతో సెలవుపై వెళ్లారు. ఆమె స్థానంలో సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ హెచ్ఒడిగా అదనపు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జనరల్ సర్జరీ వార్డును పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఆరోగ్యం కుదుట పడితే డిశ్చార్జి చేయాలని ఆదేశించారు. రోగులకు ఆపరేషన్లు అవసరం అనుకుంటే వెంటనే చేసేందుకు ప్రయత్నం చేద్దామని సూచించారు. సూపరింటెండెంట్‌కు కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ రేడియోలోజికల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ వినతి పత్రం అందచేసింది. రేడియాలజీ టెక్నీషియన్స్ తమ సమస్యల గురించి వివరించగా సానుకూలంగా స్పందించారు. సమస్యలను డిఎంఇఒ దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జి.రవీంద్ర, జిల్లా అధ్యక్షులు వై.వరుణ్ ప్రకాష్, రాష్ట్ర కార్యదర్శి బి.మణిబాబు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎం.షకిన్ బాబు. జె.హరినాథ్, వై.యలమందరావు, వైవి చారి పాల్గొన్నారు.

వైద్య సేవలు భేష్ : డాక్టర్ పరుశురామయ్య

ప్రభుత్వ ఆసుపత్రి ఐసియులో చికిత్స పొందుతున్న రిటైర్డు ఎంహెచ్ఒ డాక్టర్ పరశురామయ్యను సూపరింటెండెంట్ పరామర్శించారు. వైద్య సేవలు అద్భుతంగా అందుతున్నాయని ఆయన సూపరింటెండెంట్‌కు చెప్పారు. ప్రైవేటు ఆస్పత్రుల కంటే జిజిహెచ్ సేవలు బాగున్నాయన్నారు.

గుంటూరు ఛానల్ దీక్షలకు పలువురు మద్దతు



ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న మానం విజేత

గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకూ పొడిగించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరాహార దీక్షలు ఆదివారంతో 19వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) నాయకులు నర్రా శ్రీనివాసరావు, మూర్తి సహా 20 మంది లాయర్లు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. రైతులకు తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కంటి వైద్య నిపుణులు డాక్టర్ చిలుకూరి శ్రీరామమూర్తి హాజరై విభేదాలు పక్కనబెట్టి నీటి కోసం రైతులు చేపట్టిన ఆందోళనలను అభినందించారు. ఈ దీక్షలను బాపట్ల మాజీ ఎంపిటిసి, టిడిపి మహిళా విభాగం నాయకులు మానం విజేత ప్రారంభించారు. దీక్షల్లో పెద్ద సంఖ్యలో పాల్గొంటున్న మహిళలను ప్రత్యేకంగా అభినందించారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకూ పోరాడాలన్నారు. బాపట్ల మండలం తెలుగు రైతు నాయకులు ఐనకంటి శ్రీనివాసరావు సంఘీభావం తెలిపారు. దీక్షల్లో కొల్లా నిర్మల, తుమ్మల రమాదేవి, ఎస్.కె.సైదాబి, ఎం.నాగవర్ధని, ఎం.సుజాత, గద్దిపాటి రామాసిత, పూలకం వెంకటలక్ష్మి, రమణ, పద్మ తదితరులు పాల్గొన్నారు. జనతాదళ్ యునైటెడ్ నాయకులు నల్లపనేని సాంబశివరావు, సిపిఐ (ఎంఎల్) నాయకులు ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, రైతు రక్షణ వేదిక నాయకులు తేళ్ల కృష్ణమూర్తి, నాయుడు సుబ్బారావు, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు కళ్యాణకృష్ణ, డాక్టర్ కొల్లా రాజమోహన్, లావు అంకమ్మచౌదరి పాల్గొన్నారు.

నూర్‌బాషా ముస్లిములకూ షాదీ తోఫా

ప్రజాశక్తి-గుంటూరు : నూర్‌బాషా దూదేకుల ముస్లిములకు కూడా వైఎస్ఆర్ షాదీతోఫా పథకాన్ని వర్తింపజేస్తూ ఉత్తర్వులు జారీ చేయటంపై రాష్ట్ర నూర్‌బాషా (దూదేకుల) ముస్లిముల సంక్షేమ సంఘం అధ్యక్షులు కె.పీర్ మహమ్మద్ హర్షం వ్యక్తం చేశారు. సిఎం జగన్మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ ఆదివారం గుంటూరులోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పీర్ మహమ్మద్ మాట్లాడారు. నూర్ బాషా దూదేకుల ముస్లిములు ఎదుర్కొంటున్న సమస్యను వైయస్సార్ షాదితోఫా అమలు సందర్భంలో సిఎం దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. నూర్ బాషా దూదేకులను కూడా ముస్లిమ్ మైనారిటీలుగా పరిగణించి వారికి కూడా ముస్లిములతో సమానంగా షాదితోఫా పథకాన్ని (రూ.లక్ష) అమలు జరిగేలా మెమో జారీ చేశారన్నారు.

కవి నాగేశ్వరరావుకు సత్కారం

ప్రజాశక్తి - తెనాలి : పట్టణానికి చెందిన కవి ఆళ్ల నాగేశ్వరరావు కవి సత్కారం అందుకున్నారు. విజయవాడ ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో కుసుమ ధర్మన్న స్మారక సాహితీ సేవా కళాపీఠం ఆధ్వర్యంలో శనివారం పురస్కార ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కవి సమ్మేళనంలో నాగేశ్వరరావు పాల్గొన్నారు. తాను రచించిన 'శ్రీకారం చుట్టాలి' స్వీయకవిత చదివి, సత్కారం పొందారు. ఆయన్ను ప్రముఖ సినీ గేయ రచయిత విపల్లి కృష్ణ, కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు కె.రాధా కుసుమ సత్కరించారు. నవ్యాంధ్ర రచయితల సంఘం అధ్యక్షుడు కలిమిశ్రీ కి కుసుమ ధర్మన్న సాహితీ పురస్కార ప్రదానం చేశారు.

వైసిపి,టిడిపి గ్రుపుల పరస్పర దాడులు

ఇంటి స్వాధీనం విషయంలో వివాదం





ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణానికి చెందిన జడా భార్గవ్ అనే వ్యక్తి వ్యక్తి కోట్ల రూపాయలు అప్పులు విదేశాలకు పారిపోయాడని భార్గవ్ కు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి సహకారం ఉందని జడా భార్గవ్ తాను చేసిన అప్పులలో ఎమ్మెల్యేకు వాటాలు ముట్టాయని టిడిపి నేతలు శనివారం ఆరోపించారు.అదేవిధంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి అధికారాన్ని అడ్డం పెట్టుకొని రూ 100 ల కోట్లు సంపాదించాడని టిడిపి నియోజకవర్గ బాద్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు,నేతలు కడియం కోటి సుబ్బారావు, చల్లా సుబ్బారావులు ఆరోపించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి జడా భార్గవ్ కు తనకు ఎటువంటి సంబంధం లేదని భార్గవ్ విషయంలో మరియు తనపై చేసిన అవినీతి ఆరోపణలు నిరూపిస్తే ఆస్తులను అనాదలకు రాసిస్తానని టిడిపి నేతలు చేసిన ఆరోపణలలో ఒక్కటి వాస్తవం లేదని శనివారం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే తీవ్రంగా ఖండించారు. జడా భార్గవ్ గత ఏడాది లండన్ వెళ్లాడని అయితే ఈ ఏడాది జనవరిలో ఇళ్ళు చల్లా సుబ్బారావుకు అమ్ముతున్నట్టు నకిలీ అగ్రిమెంట్ పత్రాలు సష్టించి ఆక్రమించేందుకు కుట్రలు చేస్తున్నారని ఎమ్మెల్యే ఆరోపించారు.

ఇదిలా వుండగా ఆదివారం జడా భార్గవ్ ఇంటిని ఆక్రమించేందుకు వచ్చిన పలువురిని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి చల్లా సుబ్బారావు తన పేరిట అగ్రిమెంట్ ఉందని మీరు ఇంటిని ఎలా ఆక్రమిస్తారని ప్రశ్నించారు. చల్లా సుబ్బారావుకు జడా భార్గవ్ ఇవ్వాల్సింది రూ 1.50 లక్షలు మాత్రమేనని దానికే ఇంటిని అక్రమించాలని చూస్తే జడా భార్గవ్ కు రూ 70 లక్షల మేము ఏం చేయాలి అంటూ ఒక మహిళ ఆవేదన వ్యక్తం చేసింది.సుబ్బారావుతో ఇంటిలోకి వెళుతున్న తనపై తన కుమారుడుపై డాక్టర్ చదలవాడ అరవిందబాబు చల్లా సుబ్బారావు తదితరులు దాడి చేశారని మహిళ వాపోయారు. ఎమ్మెల్యే అవినీతి అక్రమాలను ప్రశ్నించారని ఓర్చుకోలేని ఎమ్మెల్యే సమస్య గురించి సానుకూలంగా మాట్లాడుతున్న తమపై వైసిపి వర్గీయులు అక్కడికి చేరుకుని తమపై దాడి చేయబోతున్న క్రమంలో ప్రతిఘటించామని డాక్టర్ చదలవాడ అన్నారు. అనవసరంగా మరికొంత మంది అప్పుల వారిని వెంటేసుకొని కోటప్పకొండ రోడ్డు అమరావతి కాలనీలో జడా భార్గవ్ ఇంటిపైకి వెళ్లారు. తీసుకున్న అప్పులు చెల్లించాలని డాక్టర్ చదలవాడ ఆధ్వర్యంలో అప్పులిచ్చినవారు దౌర్జన్యం చేశారు. జడా భార్గవ్ సన్నిహితులలో వైసిపికి అనుకూలంగా ఉన్న కొందరు డాక్టర్ చదలవాడను అప్పులు తిరిగి చెల్లించాలని కోరిన వారిపై దౌర్జనానికి దిగారు. ఇరువురు రాళ్ళ దాడి చేసుకున్నారు.ఘటనా స్థలానికి ఇరు పార్టీల నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో చేరుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు.

దాడి చేసి కిటికీలు, ఫర్నిచర్ ని పగలగొట్టిన వైసిపి గ్రూపు

నిన్న ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పై విలేకరుల సమావేశంలో పలు అవినీతి ఆరోపణలు చేసిన చల్లా సుబ్బారావు కోటప్పకొండ రోడ్డులో ఒక ఇంటిని సుబ్బా రావు ఆక్రమించాడు అని వైసీపీ వర్గీయుల ఆరోపణ.

పరస్పరం రాళ్ల దాడి

ఇరువర్గాల రాళ్ళ దాడిలో పోలీస్ జీపు , టీడీపీ నేత కడియాల రమేష్,అరవిందబాబు కార్లు పాక్షికంగా ధ్వసం అయ్యాయి. రాళ్ళ దాడిలో అరవింద బాబు కారు డ్రైవర్లకు స్వల్ప గాయాలయ్యాయి.

రాజకీయం తగదు

ఘటనా స్థలానికి చేరుకున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ టిడిపి అధికార ప్రతినిధిగా చలా మణి అవుతున్న చల్లా సుబ్బారావు ఒక రౌడీ షీటర్ అని ఈ హయంలోని అతనిపై రౌడీషీట్ ఓపెన్ చేయడం జరిగిందని రౌడీలను వెంటేసుకొని అరవిందబాబు రాజకీయం చేయడం తగదన్నారు. ఇప్పటికీ అరవింద బాబు తనపై ఎన్నో ఆరోపణలు చేశారని ఒక్కటి కూడా లేక పోయారని ఆధారాలు లేకుండా రాజకీయ లబ్ధి కోసం అసత్య ప్రచారాలు చేయడం తగదని హితవు పలికారు. తన టికెట్టును కాడుకునేందుకు అరవింద్ బాబు దిగజారి ప్రవర్తిస్తున్నారని ఇటువంటి రాజకీయాలు ఉపేక్షించేది లేదని ఎస్పీ, డిఎస్పీ తో మాట్లాడి పరిస్థితి చక్కపెట్టాలని ,వివాదాలు కారణమైన వారిని అదుపులోకి తీసుకోవాలని చెప్పారు. వివాదాలకు పాల్పడిన వారిలో వైసీపీకి చెందినవారు ఉన్న అదుపులోకి తీసుకోవాల్సిందేనని పోలీసులకు తాను సూచించినట్లు పేర్కొన్నారు.

రాస్తారోకో

అరవిందబాబు, కడియాల రమేష్ కు చెందిన కార్లు ధ్వంసం కావడం టిడిపి నాయకులపై వైసిపి నేతల దాడులను నిరసిస్తూ స్థానిక గుంటూరు రోడ్డు లోని టిడిపి కార్యాలయం ఎదుట టిడిపి శ్రేణులు రాస్తారోకో నిర్వ హించారు. రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అవినీతిపై పోరాటం చేయాల్సిన పోలీసు వ్యవస్థ పూర్తిగా వైసిపికి పనిచేస్తూ వైఫల్యం చెందిందన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి దాడులను ప్రోత్సహించడం సరికాదు అన్నారు.

లండన్ నుండి జడా భార్గవ్ సెల్ఫీ వీడియో

చల్లా సుబ్బారావుకు ఇంటిని అమ్మేందుకు అగ్రిమెంట్ రాశానని చెప్పడం అవాస్తవం. సోదరుని అవసరం కోసం సుబ్బారావు దగ్గర రూ 2 లక్షలు రూ 5/- వడ్డీకి తీసుకోవడం జరిగిందని దానికి సంబంధించి వడ్డీతో పాటు రూ.50 వేలు జమ చేయడం జరిగిందన్నారు. మిగిలిన రూ .1.50 లక్షల కోసం మా ఇంటి వద్దకు తరచుగా తాగి వచ్చి గొడవ చేసి ఇంట్లో వాళ్ళని బెదిరించారన్నారు. అనారోగ్యంతో ఉన్న తండ్రికి బైపాస్ సర్జరీ జరగడం వలన ఆరోగ్య విషయమై అక్కడ నుండి బయటకు రావడం జరిగిందన్నారు. ఎవరు లేకపోవడాన్ని అలుసుగా భావించిన చల్లా సుబ్బారావు ఇంటి తాళాలు పగలకొట్టి నకిలీ అగ్రిమెంట్ సష్టించారని చెప్పారు. ఇంట్లోని సామాన్లు దొంగిలించడమే కాకుండా రోజు ఇంటిలో మద్యం సేవిస్తున్నారని తెలిసిందన్నారు. తాను టిడిపి అభిమానినని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి తనకు సహకరించాడని టిడిపి నేతలు చెప్పిన మాటలలో వాస్తవం లేదన్నారు.మా కుటుంబ ఆర్థిక విషయాలతో ఇరు పార్టీల నాయకులు రాజకీయం చేసి రోడ్ మీదకు తీసుకొచ్చారని ఆవేదన చెందారు.





విద్యార్థి అదృశ్యం



ప్రజాశక్తి - తుళ్లూరు

అమరావతి మండలం ధరణికోటకు చెందిన కర్రి విశ్వతేజ్ కనిపించడం లేదని ఆదివారం పోలీసులకు ఫిర్యాదు అందింది.22 ఏళ్ల వయస్సు కలిగిన విశ్వ తేజ్ ఈ నెల 15 వ తేదీన ధరణికోటలోని తన ఇంటి నుంచి ఆర్టీసి బస్సులో ప్రయాణించి తుళ్లూరు మండలం లోని వెలగ పూడికి చేరుకున్నాడు. అక్కడ నుంచి తన ఫ్రెండ్ బైక్ పై 9 గంటలకు విట్ యూనివర్శిటీకి వెళ్ళాడు.తిరిగి గం10.40 లకు బయటికి వచ్చాడు. అప్పటినుంచి విశ్వ తేజ్ ఫోన్ స్విచ్ ఆఫ్ లో ఉంది.ఈ విషయమై పుట్టి అభినందన స్వామి అనే వ్యక్తి ఫిర్యాదు చేశారని ఎస్ఐ సోమేశ్వర రావు తెలిపారు.విశ్వతేజ్ విట్ యూనివర్శిటీలో సిఎస్ఇ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు.ఎత్తు 5 - 8 అడుగులు ఉంటాడని,బ్లూ కలర్ జీన్ ప్యాంటు,మెరున్ కలర్ షర్ట్ ధరించి ఉన్నాడని ఎస్ఐ చెప్పారు.ఆచూకీ తెలిసినవారు 7702393094 నంబర్ లో సంప్రదించాలని కోరారు.

సేవా కార్యక్రమాలకు సహకరిస్తా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - తెనాలి



ఆర్యవైశ్య సంఘాల సామాజిక సేవ కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. ఆదివారం పట్టణ ఆర్యవైశ్య సంఘం, దాని అనుబంధ సంఘాలు సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక బోస్ రోడ్డులోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థాన సత్రం కమిటీ ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘాలు నిర్వహించే సామాజిక సేవా కార్యక్రమాలకు తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. పేదలకు ఉపయోగపడాలనే సంకల్పంతో శిబిరానికి సహకరించిన హాస్పిటల్ ఎమ్‌డి డాక్టర్ కమ్మెల శ్రీనివాస్‌ను అభినందించారు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు భాస్కరుని శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, వైసిపి పట్టణ అధ్యక్షులు దేసు శ్రీనివాసరావు, పట్టణ ఆర్యవైశ్య సంఘాల కో-ఆర్డినేటర్ మద్దాలి శేషాచలం, జవ్వాజి వెంకట కృష్ణారావు పాల్గొన్నారు.

కోతముక్క స్థావరంపై దాడి

ప్రజాశక్తి-తెనాలి

కోత ముక్క స్థావరంపై రూరల్ పోలీసులు శనివారం అర్ధరాత్రి దాడి చేశారు. ఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు వెల్ల డించిన వివరాల ప్రకారం మండల పరిధిలోని తేలప్రోలు శివారులో డంపింగ్ యార్డు వద్ద కోతముక్క అడుతున్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. ఐదుగురు బృం దాన్ని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3,650 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారి వద్ద గల రెండు ద్విచక్ర వాహనాలు, ఐదు సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. కేసు నమోదు చేశారు. అసాంఘిక కార్యకలాపాలను ఉపేక్షించేది లేదని ఎస్ఐ హెచ్చరించారు.

దారి విషయంలో ఘర్షణ

అన్నదమ్ములకు గాయాలు



గాయపడ్డ శ్రీను

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్

పొలాలకు వెళ్ళే దారి విషయంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో అన్నదమ్ములు గాయ పడ్డారు. సత్తెనపల్లి మండలం అబ్బూరులో జరిగిన సంఘటన లో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన రైతు రంగం వీర్ల వెంకయ్య 1.75 సెంట్ల లో పత్తి సాగు చేశారు . మొక్క దశలో వున్నాయి. వీర్ల వెంకయ్య పొలంలో గుండా బాదర బోయిన వెంకటేశ్వర్లు అనే రైతు అరక తీసుకొని తన పొలానికి వెళ తున్నాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వివాదం నెలకొంది. బాదరబోయిన వెంకటేశ్వర్లు మరి కొంతమంది కలిసి రంగం వీర్లవెంకయ్య అతని తమ్ముడు రంగం శ్రీనుల పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. శ్రీను తీవ్రంగా గాయపడగా వీర్ల వెంకయ్య స్వల్పంగా గాయపడ్డాడు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - మాచర్ల

వెల్దుర్తి మండలం రచ్చ మల్ల పాడు అడ్డరోడ్డు దగ్గర ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి అందులో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి ప్రధమ చికిత్స అనంతరం మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రి నుండి మెరుగైన చికిత్స కోసం వారిని నరసరావుపేట తరలించారు దుర్గి మండలం ముత్తుకూరు గ్రామానికి చెందిన నర్రా నరసింహారావు రెచ్చవలపాడు వైపు నుండి మాచర్ల వైపు ద్విచక్ర వాహనంపైవస్తున్నాడు మార్కాపురం వైపు నుండి హైదరాబాద్ వెళ్లేందుకు ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. రెండవ వాహనాలు రసమునపాడు అడ్డరోడ్డు వద్ద ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి నరాల నరసింహారావుకు తీవ్ర గాయాలు కాగా యువకులలో భక్తుల నాగరాజుకు కాలు ఫ్రాక్చర్ అయింది మరో యువకునికి స్వల్ప గాయాలయ్యాయి గాయాలు పాలైన వారిని మండాధి సర్పంచ్ శీలం సైదారెడ్డి దగ్గరుండి 108 ద్వారా మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వెల్దుర్తి పోలీసులు కేసు నమోదు చేశారు.





రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

ఉమ్మడి పౌరస్మృతిని నిరసించండి

ప్రజాశక్తి-నకరికల్లు

బిజెపి అమలు చేస్తున్న ఉమ్మడి పౌర స్మృతి (యుసిసి) ని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసించారు. స్థానిక భగత్ సింగ్ భవన్‌లో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి పిడిఎం జిల్లా సహాయ కార్యదర్శి షేక్ మస్తాన్ వలి అధ్యక్షత వహించారు. భారత్ బచావో రాష్ట్ర కమిటి నాయకులు కోలా నవజ్యోతి, పిడిఎం సీనియర్ నాయకుడు వై.వెంకటేశ్వరరావు ప్రధాన వక్తలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి పౌరస్మృతిని అందరూ నిరసించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. మతాల, కులాల మధ్య చిచ్చు పెట్టి మళ్ళీ అధికారం పొందాలని బిజెపి కుట్ర పన్నుతోందని విమర్శించారు. బడుగు , బలహీనర్గాలకు, ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీలు, గిరిజనులు, ఆదివాసీలకు అండగా ఉన్న రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి మనుధర్మంను అమలు చేయాలని పన్నాగం పన్నుతోందని అన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు, సమానత్వ సమాజం కోసం బీజేపీని ఓడించాలని, యుసిసిని తిరస్కరించాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.కోటా నాయక్, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి షేక్ సైదా, మండల కో ఆప్షన్ మెంబర్ షేక్.హుస్సేన్, సమాచార హక్కు చట్టం ప్రచార ఐక్య వేదిక మండలాధ్యక్షుడు ముజావర్ జాన్ అహ్మద్, వైసిపి నాయకుడు సలీల్, టీడీపి నాయకుడు నాడాల జాను, సీఐటీయూ నాయకుడు గోదా చిన్ని, మాలమహానాడు సోషల్ మీడియా ఇంచార్జీ గోదా బాల, జిలానీ, మాణిక్య రావు, కరెంటు సైదా, సిహెచ్ . చింతయ్య, మడకా వెంకటేశ్వర్లు, అమరాన్ మస్తాన్, లాలూ, చట్టు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



చర్మకారులకు రుణాలు ఇవ్వండి

ప్రజాశక్తి - వినుకొండ

శావల్యాపురం మండలం కారుమంచి గ్రామం నందు వినుకొండ నియోజకవర్గం ఆంధ్రప్రదేశ్ చర్మకార సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మల్లవరపు రవికుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుండి మాదిగ జాతీయుల సంక్షేమానికి అభివృద్ధికి, ఉపాధి కల్పనకు రూ.65 కోట్లు గ్రాంటు అమౌంట్ వచ్చాయని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున బహిరంగంగా చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. ఇంతవరకు లెదర్ పార్క్ నిర్మాణాలు చేపట్టలేదనీ, వెంటనే లెదర్ పార్క్ లు నిర్మించాలని 300 మందికి లీడ్ క్యాంపులో ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నిధులు నుండి వినుకొండ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పెన్షన్లు పొందుతున్న మాదిగ చర్మకారులకు, డప్పు కళాకారులకు వందమందికి ఒక్కొక్కరికి లక్ష రూపాయలు చొప్పున కోటి రూపాయలు రుణం మంజూరు చేయాలని, 500 మంది మాదిగ యువకులకు ఆధునిక పద్ధతిలో లెదర్ గూడ్స్, ఫుట్‌వేర్ తయారీలో శిక్షణ ఇవ్వటానికి మార్చి 17న కోటి రూపాయలు లీడ్ క్యాప్ మేనేజింగ్ డైరెక్టర్ శంకర్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విజయవాడ లో నిధులు ఉన్నట్లు తెలిపారని అన్నారు. కార్యక్రమంలో జుంజు. యోహాన్, దారా. ఆశీర్వాదం, మల్లవరపు. రామయ్య, అక్కయ్య, రమణమ్మ విజయ కుమారి, దేవి పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు అన్యాయం

- వైసిపి పాలనలో దూరమైన సంక్షేమ పథకాలు
- ఎమ్మెల్యేకు సిఐటియు వినతి, నిరసన



ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘాల నాయకులు



ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పిఎకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

భవన నిర్మాణ కార్మికులకు 2009 నుండి అమలవుతున్న సంక్షేమ పథకాలను, వైసిపి అధికారంలో ఉన్న నాలు గున్నరేళ్లలో వాటిని నిలుపుదల చేసిందని, తిరిగి ప్రారంభిం చాలని భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా కార్యదర్శి షేక్ సిలార్ మసూద్ అన్నారు. ఈ మేరకు ఆదివారం భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీని వాస రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిలార్ మసూద్ మాట్లాడుతూ సహజ మరణం, ప్రమాద మరణం తాత్కాలిక వైకల్యం, పెళ్లి కానుకలు, వివాహ కానుకలు, వృత్తి నైపుణ్య శిక్షణ స్టైఫండ్, రిజిస్టర్ కానీ భవన నిర్మాణ కార్మికుల పరిహారాలు.. ఇటువంటి అనేక పరిహారాలను భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా గతంలో అమలు చేశారని గుర్తుచేశారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత 1214 మెమో ద్వారా ఈ సంక్షేమ పథకాలన్నింటిని నిలుపుదల చేసిందని విమర్శించారు. దీని వల్ల నరసరావుపేట నియోజక వర్గంలో సుమారు 3,000 మంది లబ్ధిదారులు సంక్షేమానికి దూరంగా ఉన్నారని, నియోజకవర్గం మొత్తం మీద 20 వేల మంది భవన నిర్మాణ కార్మికులు ఈ సంక్షేమానికి దూరమవుతున్నారని చెప్పారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలన్నీ పునరుద్ధరించి, సంక్షేమ బోర్డు ద్వారానే వారికి లబ్ధి చేకూర్చాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వినతిపత్రం అందజేశారు. ఆయా సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్య క్రమంలో సంఘం నరసరావుపేట మండల కార్యదర్శి కె.సురేష్, పట్టణ కార్యదర్శి కె.కోటిరెడ్డి, రొంపిచర్ల మండల కార్యదర్శి బి.బాలకోటయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు నిలిపివేసి తీరని అన్యాయం చేశారని పల్నాడు జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు అవ్వరు ప్రసాద్ విమర్శించారు. సిఐటియు, సిడబ్ల్యూఎఫ్ఐ పిలుపు మేరకు ఆదివారం కార్మికులు ఎమ్మెల్యే ఇంటి వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ద్వారానే భవన నిర్మాణ కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలని డిమాండ్ చేశారు. పదిహేనేళ్లపాటు పాటు దేశ వ్యాప్తంగా పోరాడి కేంద్రప్రభుత్వం చేత 1996లో భవన,ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టాన్ని పోరాడి సాధించుకున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టం ద్వారా వై.యస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే వరకు భవన నిర్మాణ కార్మికులకు సహజ మరణం చెందితే రూ80 వేలు, ప్రమాద మరణం చెందితే రూ.5లక్షల 20వేలు, కార్మికుని భార్య, ఇద్దరు కుమార్తెల ప్రసవాలకు ఒక్కొక్కరి కాన్పుకు రూ.20వేలు, (ఒక్కొక్కరికి రెండు కాన్పులు), కార్మికుని కుమార్తె వివాహానికి రూ.20 వేలు (ఇద్దరు కుమార్తెలకు) తాత్కాలిక అంగవైకల్యానికి రూ.9 వేలు, దీర్ఘకాలిక వ్యాధులకు తగు లబ్ధి వంటి తదితర సంక్షేమ పథకాలు అందేవని, ప్రస్తుత ప్రభుత్వం వీటిని నిలుపుదల చేసిందని అన్నారు. వినుకొండ అసెంబ్లీ నియోజకవర్గంలోని శావల్యాపురం, వినుకొండ పట్టణం, మండలం, బొల్లాపల్లి, ఈపూరు, నూజెండ్ల మండలాల్లోని సుమారు 20 వేల మంది భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ పథకాలకు గత నాలుగేళ్లుగా దూరమై ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నియోజక వర్గంలోని వేలాది లబ్ధిదారులకు సుమారు రూ.8 కోట్లు సంక్షేమ పథకాలు నిలిపివేశారని అన్నారు. కార్మికుల పట్ల చిత్తశుద్ధితో నియోజకవర్గంలో ఉన్న సుమారు 12 వేలమంది భవన నిర్మాణ కార్మికుల సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళి 1214 మెమో రద్దు అయ్యేటట్లు, సమస్యలు పరిష్కారం అయ్యేటట్లు చూడాలని వారు కోరారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అందుబాటులో లేకపోవడంతో ఆయన పిఎ అంజిబాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ఎ.ఆంజనేయులు, సిఐటియు నాయకులు బి. వెంకటేశ్వర్లు, కె.నాసర్‌బీ, బి.తిమ్మయ్య, శ్రీను, విరేబియా తదితరులు పాల్గొన్నారు.

7న మహిళా పోరుయాత్ర, బహిరంగ సభ



సమావేశంలో మాట్లాడుతున్న గద్దె ఉమాశ్రీ

ప్రజాశక్తి-సత్తెనపల్లి

ఐద్వా ఆధ్వర్యంలో ఆగష్టు 7న హింసపై మహిళల పోరు యాత్ర రాష్ట్ర జాత సత్తెనపల్లి పట్టణానికి వస్తున్న సందర్భంగా జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని ఐద్వా పట్టణ కార్యదర్శి గద్దె ఉమాశ్రీ పిలుపు నిచ్చారు. ఈ మేరకు ఆదివారం స్థానికంగా జరిగిన ఐద్వా పట్టణ కమిటీ సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సమావేశానికి మునగా జ్యోతి అధ్యక్షత వహించారు. ఉమాశ్రీ మాట్లాడుతూ 7న సభను జయప్రదం చేసేందుకు వార్డుల్లో కరపత్రాలు పంపిణీ చేసి,సమావేశాలు నిర్వహించాలని, కమిటీలు వేయాలని కార్యకర్తలకు సూచించారు. మహిళలపై జరుగుతున్న హింసను అధ్యయనం చేయాలని, కమిటీ నిపుణులతో కమిటీ వేయాలని, మహిళలకు,చిన్నారులకు రక్షణ కల్పించే చట్టాలను కఠినంగా అమలు చేయాలని, నిందితులను ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా త్వరితగతిన విచారణ జరిపి కఠిన శిక్షలు విధించాలని, ప్రభుత్వం మీడియా మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.హింస, అశ్లీలత, అసమానతలను ప్రేరేపించే చలనచిత్రాలను, టివి సీరియల్స్, ఇంటర్నెట్ కార్యక్రమాలను నిషేధించాలని డిమాండ్ చేశారు. మద్యం,మత్తు పదార్థాలను నియంత్రణకు చర్యలు చేపట్టాలని, మండలానికి ఒక్క మద్యం షాపును మాత్రమే అనుమతించాలని కోరారు. ఆయా డిమాండ్ల సాధనకు అన్ని పక్షాలను కూడగట్టి ఐద్వా ఆందోళన సాగిస్తున్నట్లు చెప్పారు. ఈ డిమాండ్లను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.ఐద్వా జిల్లా కార్యదర్శి గుంటుపల్లి రజిని మాట్లాడుతూ హింస లేని సమాజం కోసం చేయి చేయి కలుపుదామని, మద్యం,మత్తు పదార్థాలను నియంత్రించాలని అన్నారు. సమావేశంలో ఐద్వా నాయకులు ధరణికోట విమల, కట్టా రమాదేవి, గింజుపల్లి నాగలక్ష్మి, మొగిలిపాలెపు రమాకుమారి పాల్గొన్నారు.

ప్రపంచ పాముల దినోత్సవం

ప్రజాశక్తి-విజయపురిసౌత్



మాచర్ల మండలం విజయపురి సౌత్‌లో ప్రపంచ పాముల దినోత్సవం సందర్భంగా నేచర్ బయోడైవర్సిటీ కనజర్వేషన్ సొసైటీ ప్రెసిడెంట్ బి. మహేష్, సెక్రటరీ ఊరే మధు,అటవీ శాఖ అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో వారు పట్టుకున్న వివిధ రకాల పాములను విడు దల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదేళ్ల నుండి నాగార్జున సాగర్ పరిసర ప్రాంతాల్లో ఎక్కడైనా ఇళ్లలోకి పాములు ప్రవేశిస్తే తమకు ఫోన్ చేస్తే వెళ్లి పట్టుకుని వాటిని సురక్షితంగా వాటి ఆవాస ప్రాంతాల్లో విడుదల చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు నివసించే ప్రాంతాల్లో పాములు వస్తే కనుక 7382125558, 9591472568 నంబర్లకు ఫోన్ చేస్తే వెంటనే వచ్చి పాములను సురక్షితంగా పట్టు కుంటామని చెప్పారు.



ఉచిత మెగా కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-నాదెండ్ల

జ్ఞానేశ్వర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని సాతు లూరులో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని ఆది వారం నిర్వహించారు. సుమారు 320 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైనవారి కి కళ్లజోళ్ళను పంపిణీ చేయ నున్నట్లు ఫౌం డేషన్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఈదర కోటయ్య స్వామి, కూరపాటి ఆంజనేయులు, షేక్ మస్తాన్ వలి, యర్రంనేని వాసు , బంటుపల్లి వెంకట్రావు, బోడ రాజా, తాతినేని రజిని తదితరులు పాల్గొన్నారు.

అప్పుడు మాటిచ్చి.. ఇప్పుడు వెళ్లగొడుతున్నారు..

- కెఎల్ రావు కాలనీలో పర్యటన సందర్భంగా సిపిఎం నాయకుల ఎదుట పేదల ఆవేదన
- ఇక్కడే ఉంచి పట్టాలిచ్చేలా చూడాలని వేడుకోలు

ప్రజాశక్తి-తాడేపల్లి

తమ ఇళ్లు ఇక్కడే ఉండే విధంగా చూడాలని, పట్టాలిప్పించే విధంగా ప్రభుత్వాన్ని ఒప్పించాలని సిపిఎం నాయకుల ముందు కెఎల్‌రావు కాలనీ బాధితులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఇటీవల రాజధానిలో భాగమైన నిడమర్రులో కెఎల్‌రావు కాలనీ వాసులకు నివాస అర్హతా పత్రాలు అందజేశారు. అయితే తాము ఎక్కడికీ వెళ్లమని పేదలు చెబుతున్నారు. సుమారు కెఎల్‌రావు కాలనీ కొండ ప్రాంతంలో రెండు వేల మంది నివాసం ఉంటున్నారు. వీరందరూ విజయవాడ ముఠా కార్మికులుగా పని చేస్తున్నారు. మహిళలు వివిధ చేతి వృత్తులను ఆసరి చేసుకుని, మరికొంత మంది ఇళ్ల పనివార్లగా జీవనోపాధి పొందుతున్నారు. ఇక్కడ ఉంటేనే తాము సురక్షితంగా ఉంటామని సిపిఎం నాయకుల ముందు చెప్పారు. గత ఎన్నికలకు ముందు అప్పుడు అధికారంలో ఉన్న పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే ఇళ్లు తొలగిస్తారని, తాము గెలిస్తే ఇళ్లను ఇక్కడే ఉంచుతామని ప్రస్తుత ఎమ్మెల్యే ఆర్‌కె చెప్పిన మాటలను గుర్తు చేశారు. ఉన్న స్థలానికే పట్టా ఇవ్వాలని జరిగే ఆందోళనకు ఎక్కడికైనా వస్తామని కెఎల్‌రావు కాలనీ బాధితులు చెబుతున్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, నాయకులు కె.కరుణాకరరావు, ఎస్.ముత్యాలరావు, కె.మేరి, సామ్యేలు పాల్గొన్నారు.

అడవిలోకి వెళ్లి బతకలేం



ఎక్కడో దూరంగా మమ్మల్ని పడేశారు. అటువంటి అడవి ప్రాంతంలో మేము ఉండేలేం. ఇటీవలే మాకున్న ఒక్కగానొక కొడుకు కూడా చనిపోయాడు. ఇక్కడే ఉంటే ఏదో కష్టపడి పని చేసుకుని బతుకుతున్నాం. మమ్మల్ని ఎక్కడికీ తరలించొద్దు. ఉన్న స్థలానికే పట్టా ఇవ్వాలి.

అచ్చాయమ్మ



కాలనీ వాసులతో మాట్లాడుతున్న పాశం రామారావు తదితరులు

వ్యసనాలకు దూరంగా ఉంటే క్యాన్సర్‌కు చెక్

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్ : జీవన విధానంలో మార్పుల కారణంగా అనేక మంది క్యాన్సర్ బారిన పడుతున్నారని హాన్స్ విల్లి క్లియర్ వ్యూ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ (యుఎస్ఎ) డాక్టర్ కె.లక్ష్మీకాంత్ చెప్పారు. రోటరీ క్లబ్ ఆఫ్ పొన్నూరు ఆధ్వర్యంలో నిడుబ్రోలు పాములపాటి రవీంద్రనాథ్ ఇంటి ఆవరణలో క్యాన్సర్ అవగాహన సదస్సు రోటరీ ప్రెసిడెంట్ బోడపాటి రామారావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. డాక్టర్ లక్ష్మీకాంత్ మాట్లాడుతూ ప్రస్తుతం రోగ నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉన్నాయని, ముందస్తుగా వైద్యం అందించడం ద్వారా త్వరగా మెరుగుపడే అవకాశం ఉందన్నారు. క్రిమిసంహారక మందుల అధిక వాడకం. మద్యపానం, ధూమపానం, పొగాకు ఉత్పత్తులు నమలడం, క్యాన్సర్ వ్యాప్తికి అధికంగా కారణమవుతున్నట్లు చెప్పారు. క్యాన్సర్ నిర్ధారణ, చికిత్స, నివారణ ను వివరించారు. కీమో థెరపీతో పాటు ఇమ్యునో థెరపీ ద్వారా సులువైన వైద్యంతో సైడ్ ఎఫెక్టులు లేకుండా చికిత్స అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో సీనియర్ రొటేరియన్ పాములపాటి రవీంద్రనాథ్, రోటరీ, ఇన్నర్ వీల్ క్లబ్‌ల సభ్యులు పాల్గొన్నారు.

మంగళగిరి, తాడేపల్లి రోటరీ క్రికెట్ లీగ్ మ్యాచ్



మ్యాచ్‌కు ముందు టాస్ వేస్తున్న సందర్భంగా ఇరు క్లబ్‌ల జట్లు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

నిత్యం సేవ కార్యక్రమాలు నిర్వహించే తాడేపల్లి, మంగళగిరి రోటరీ సభ్యులు ఆదివారం సాయంత్రం క్రికెట్ ఆడారు. మంగళగిరి – తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కుంచనపల్లి ఎస్.స్క్వేర్ టర్ఫస్ గ్రౌండ్లో రోటరీ క్లబ్ అఫ్ తాడేపల్లి. రోటరీ క్లబ్ అఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో రోటరీ క్రికెట్ లీగ్ మ్యాచ్ జరిగింది. రోటరీ సభ్యులు మాట్లాడుతూ మానసిక ఉల్లాసానికి, ఉత్సాహానికి ఇలాంటి క్రీడలు అవసరమని, రోటరీ సభ్యులకు నూతన ఉత్తేజంతో కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్లు మురళీకృష్ణ, వేణుగోపాల్, జోనల్ చైర్మన్ బి.నాగసాయి ప్రసాద్, పివి సత్యనారాయణ, రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు పి.కిరణ్, కార్యదర్శి చంద్ర ఓబులారెడ్డి, కోశాధికారి జి.నాగరాజేష్, మాజీ అధ్యక్షులు ఎం.వివేకానందరెడ్డి, ఆర్.సుకుమార్‌రెడ్డి, కె.శివన్నారాయణ, ఆర్.రమేష్‌బాబు, ఎస్.రామకృష్ణ, డి.క్రాంతికుమార్, మల్లికార్జునరావు, చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్.రమేష్, ఎస్.వి నాగకిరణ్, ఎం.నగేష్, కె.నరేంద్ర, రోటరీ క్లబ్ మంగళగిరి అధ్యక్షులు ఎ.రేవంత్, కార్యదర్శి జి.శ్రీనివాసరావు, కోశాధికారి ఎన్.వెంకటేశ్వరరావు, ఎ.మురళీ మోహన్‌రావు, ఎం.క్రాంతికుమార్, పి.నిరంజన్ గుప్తా, అనిల్ చక్రవర్తి, పి.రాజశేఖర్, టి.రామకృష్ణ, మాజీ అధ్యక్షులు టి.సతీష్, ఆర్.నాగేశ్వరరావు, జి.అమరేష్, ఎం.కోటేశ్వరరావు, షేక్ జిలాని, డాక్టర్ డి.శివ పాల్గొన్నారు.

వాలంటీర్ వ్యవస్థపై పవన్ బరితెగింపు వ్యాఖ్యలు

చెప్పులతో దాడి చేసే పరిస్థితి తెచ్చుకోవద్దు : కారుమూరు వెంకటరెడ్డి



ప్రజాశక్తి-తెనాలి

వాలంటీర్ వ్యవస్థపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేస్తున్న విమర్శలు మానుకోకుంటే వాలంటీర్లే ఆయనపై చెప్పులతో దాడి చేసే పరిస్థితి తప్పదని వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కారుమూరు వెంకటరెడ్డి అన్నారు. వాలంటీర్లు హూమన్ ట్రాఫికింగ్‌కు పాల్పడుతున్నారని పవన్ మాట్లాడటం దారుణమన్నారు. అసలు హూమన్ ట్రాఫికింగ్ అంటే పవన్‌కు అర్థం తెలుసా అని ప్రశ్నించారు. పవన్‌కు వ్యక్తిగత విలువలు లేకపోగా, రాజకీయంగానూ దిగజారి మాట్లాడుతున్నారని అన్నారు. ప్యాకేజి కోసం ఏ పార్టీతో కలిసి నడవటానికైనా పవన్ వెనుకాడడని విమర్శించారు. వృద్ధాప్య పింఛను కోసం దరఖాస్తు చేసేవ్యక్తికి వయసు నిర్ధారణ అనివార్యమని, దానికి ఆధార్ ఆధారమతుందని, దీనికే డేటా ప్రైవేటు వ్యక్తుల్లోకి పోతుందనటంలో అర్థం లేదన అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, వాలంటీర్లు అంతా బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నట్లు పవన్ చెబుతున్నారన్నారని, ఇది వ్యవస్థపై కనీస బాధ్యతలేని ఆరోపణ అని అన్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో ఏ వస్తువు కొనుగోలు చేయాలన్నా అడ్రస్, ఫోన్‌నంబర్, మెయిల్‌ఐడితో సహా ఇస్తున్నారని, జనసేన సభ్యత్వ సేకరణలోనూ ఫోన్ నంబర్, మెయిల్ ఐడి సేకరిస్తున్నారని గుర్తు చేశారు. ఇప్పటికైనా వాస్తవాలను గుర్తించి పవన్ కల్యాణ్ మాట్లాడితే మంచిదని, లేకుంటే ప్రజలే ఆయన్ను తిరగనీయకుండా చేస్తారని అన్నారు. పవన్ కల్యాణ్ లాంటి ప్యాకేజి స్టార్లు ఎంత మంది ఎన్ని రకాలుగా దిగజారి మాట్లాడినా ప్రజల్లో వైసిపికి ఉన్న పట్టు, సిఎం జగన్‌పై ఉన్న అభిమానం ఏమాత్రం తగ్గదన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపి విజయం తథ్యమని, జగన్ మరలా రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావటం ఖాయమని అన్నారు.

చంద్రబాబు డైరెక్షన్.. పవన్ యాక్షన్..

వాలంటీర్లకు పవన్ క్షమాపణ చెప్పాలి : ఎన్ఆర్ఐ బొంతు నాగిరెడ్డి



ప్రజాశక్తి-తెనాలి

స్వచ్ఛందంగా సేవ చేస్తున్న వాలంటీర్ల వ్యవస్థను కించపరిచే విధంగా మాట్లాడటం పవన్ కల్యాణ్‌కు తగదని, వాలంటీర్లకు ఆయన తక్షణమే క్షమాపణ చెప్పాలని వైసిపికి చెందిన ప్రవాసాంధ్రుడు బొంతు నాగిరెడ్డి డిమాండ్ చేశారు. పవన్ ఎన్నికలప్పుడు జనాల్లోకి వచ్చి హడావుడి చేయటం తప్ప, మిగిలిన కాలంలో ఎక్కడుంటాడో అతనికే తెలియదన్నారు. గత ఎన్నికల్లో రెండు చోట్లా చిత్తుచిత్తుగా ఓడిపోయిన పవన్‌కు మరలా తిరిగి అదే పరాభవం ఎదురు కాబోతుందని ఎద్దేవా చేశారు. నెలకు రూ.5 వేలే తీసుకుంటూ వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు తలుపు తట్టి మరీ వాలంటీర్లు పింఛన్లు ఇస్తున్నారని, అలాంటి వారిపై అవాకులు చవాకులు పేలటం సరికాదని అన్నారు. మూడు పెళ్లిళ్లు చేసుకున్న పవన్ మహిళలు, వారి రక్షణ అంటూ మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. ప్యాకేజీ కోసం చంద్రబాబు నాయుడు డైరెక్షన్‌లో పవన్ యాక్షన్ చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రానికి మళ్లీ జగనే ముఖ్యమంత్రి అని, పవన్ లాంటి వాళ్లు ఎంతమంది ఎన్ని ప్రగల్భాలు పలికినా వైసిపి విజయానికి ఢోకా లేదని అన్నారు.



అవగాహన కల్పిస్తున్న బృందం

మిద్దె తోటల పెంపకంపై అవగాహన

ప్రజాశక్తి-తాడేపల్లి

బైపాస్‌రోడ్డులో అమరావతి ఐకాన్ అపార్టుమెంట్లో ఆదివారం మిద్దె తోటల పెంపకంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. వన్ ఎర్త్ వన్ లైఫ్ మిద్దె తోట గ్రూపు బృందం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పురుగు మందులతో కూరగాయలు, ఆకుకూరలు పండించడం వల్ల ఆహారం విషతుల్యం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మార్కెట్లో కూరగాయలు, ఆకుకూరలు విషతుల్యమైన మందులు వాడి పండించినవని హెచ్చరించారు. ఒక పంటపై పురుగు మందులు వాడిన తరువాత నాలుగైదు రోజులు పంట తీయడానికి సమయం ఉండాలని చెప్పారు. కానీ మార్కెట్లో మందులు వేసిన మరునాడే తెచ్చి అమ్మడం వల్ల అవి విషతుల్యం అవుతున్నాయని చెప్పారు. దీని వల్ల వివిధ రకాల జబ్బులు ప్రజలకు వస్తున్నాయని, దీని నుంచి బయట పడాలంటే ఇంట్లోనే మొక్కల పెంపకం వల్ల ఆరోగ్యకరమైన కూరగాయలు, ఆకుకూరలు తయారు చేసుకోవచ్చని చెప్పారు. పర్యావరణాన్ని కూడా కొంతమేర పరిరక్షించుకోవచ్చన్నారు. మిద్దె తోట పెంపకానికి కావాల్సిన విత్తనాలు, మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వన్ ఎర్త్ వన్ లైఫ్ మిద్దె తోట బృందం ఏలూరి లీలాకుమారి, శ్యామ్‌ప్రసాద్, ఎ.సురేష్ కుమార్, విజయ్‌కుమార్, ఇందిర, అమరావతి ఐకాన్ తరుపున వై.బాలకృష్ణ, రామశేఖర్, రియాజ్ బాష పాల్గొన్నారు.



టిడిపి 'భవిష్యత్‌కు గ్యారెంటీ' ప్రచారం

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు టిడిపి గ్యారెంటీగా ఉంటుందని ఆ పార్టీ మండల కార్యదర్శి గింజుపల్లి శివరామప్రసాద్ అన్నారు. మండల పరిదిలోని నడింపాలెంపాలెంలో 'భవ్యషత్‌కు గ్యారెంటీ' ప్రచారాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివరామప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సమస్యలను దృష్టిలో పెట్టుకొని చంద్రబాబు నాయుడు మినీ మేనిఫెస్టోను విడుదల చేశారని చెప్పారు. దీనికి ప్రజల నుండి మంచి ఆదరణ లభిస్తోందని, రానున్న ఎన్నికల్లో టిడిపి గెలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.సుబ్బారెడ్డి, ఎం. రామకృష్ణ, డి.భాగ్యరావు, ఎ.బసవబాబు, బి.సుబ్బారావు, బి.శివరామయ్య, ఎం.రవి, కె.అంకమ్మరావు, కె.సుబ్బారావు, ఎ.కోటేశ్వరరావు, ఎం.రమేష్, షేక్ జానీ, జయపాల్, సిహెచ్.మురారి, ఎం.ప్రసాద్ పాల్గొన్నారు.


350 మందికి ఉచితంగా కంటి పరీక్షలు

ప్రజాశక్తి-దుగ్గిరాల

చిలువూరు లో చాట్ల ఆర్లమ్మ జ్ఞాపకార్థం ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించినది. తెనాలికి చెందిన చదలవాడ స్కిన్ అండ్ ఐ కేర్ ఆసుపత్రి మరియు చిలువూరు కదోలిక విచారణ గురువు ఫాదర్ చాట్ల మరియాదాసు సంయుక్తంగా నిర్వహించిన శిబిరంలో 350 మందికి కంటి పరీక్షలు చేసి కళ్లజోళ్లను అందించరు. కార్యక్రమంలో డాక్టర్ చదలవాడ ఉమాదేవి, స్థానికులు ఫాదర్ మేరీబాబు, ఉపదేశి, బాల విల్సంట్, దేవపాల్, జి.ఆనంద్ పాల్గొన్నారు.

మింగుడు పడని ధరలు!

- ఆకాశాన్ని అంటిన టమాటా రేటు
- రూ.175కు చేరిన కందిపప్పు



ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ఉల్లిపాయల దగ్గర నుండి నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కూరగాయలధరలు ఆకాశాన్నంటి సామాన్య మధ్యతరగతి ప్రజల నడ్డి విరుస్తున్నాయి. కూర గాయల ధరలు భగ్గుమంటున్నాయి. టమాటా పప్పులు ధరలు చుక్కలనంటాయి. టమాటా ధర పెట్రోల్ ధరను మించిపోయింది.కేజీ టమాటా రూ. 120 నుంచి రూ.150 వరకు ధర పలుకుతోంది. ఇతర కూరగాయల ధరలు కూడా కిలో రూ.50, రూ.60 వరకు ఉంది. కందిపప్పు కిలో ధర రూ.175, కిలో అల్లం రూ. 300 కు పెరిగాయి. బియ్యం 50 కి పెరిగింది. రేపో మాపో ఉల్లి ధరలు రూ.50 చేరే అవకాశం ఉంది. పేద, మధ్య,తరగతి ప్రజలు కూర గాయలు, పప్పులు కొనలేక అవస్థలు పడుతున్నారు. చికెన్ ధరలు చుక్కలనంటాయి. కిలో చికెన్ రూ.300 కు చేరింది. వీటికి తోడు వంటగ్యాస్ సిలిండర్ ధర రూ. 1200 కు పెరిగింది. కూరగాయలు కొనలేని మధ్యతరగతి ప్రజలు కర్రీస్ పాయింట్లలో కూరలు కొనుగోలు చేస్తున్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఆదాయం పెరగక పోవ డంతో పేదలు నిత్యావసరాలు కొనుగోలు చేయలేక ఇబ్బంది పడుతున్నారు. కూర గాయలు కొనలేని అల్పాదాయ వర్గాలు పచ్చడి మెతు కులతో సరిపెట్టుకుంటున్నారు. కూరగాయల దిగుబడి తగ్గడంతో పాటు కర్నాటక రాష్ట్రం, మదనపల్లి ప్రాంతాల నుండి టమాటా దిగుమతి చేసుకోవడంతో ధరలు పెరి గాయని. వ్యాపారులు చెబుతున్నారు. రేషన్ దుకాణాల ద్వారా రాయితీపై కందిపప్పు పంపిణీ చేయాల్సిన ప్రభు త్వం సరఫరాను నిలిపివేసింది. కేవలం బియ్యం పంచ దార మాత్రమే దుకాణాల ద్వారా కార్డుదారులకు అంద జేస్తున్నారు. రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు పంపిణీ చేయాలని కార్డుదారులు డిమాండ్ చేస్తున్నారు. ధరలు నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు ఇవ్వండి



గతంలో కిలో కందిపప్పు రూ.70 కి రేషన్ షాపు ల ద్వారా ఇచ్చేవారనం వ్యవ సాయ కూలీ మల్లెం ఆదెమ్మ అన్నారు. ప్రస్తుతం దీని ధర విపరీతంగా పెరగ డంతో కొనలేకపోతున్నాం. కందిపప్పు, టమాటాల రేట్లతో పాటు నిత్యావసరాల ధరలు పెరగటంతో ఇబ్బంది పడు తున్నాం. రేషన్ షాపుల ద్వారా కందిపప్పు అందివ్వాలి.

ధరలను నియంత్రించండి



నిత్యావసరాల ధరలను నియంత్రించాలని గృహిణి ఇంద్రాణి అన్నారు. కూరగాయలు ధరలు విప రీతంగా పెరగ డంతో కూరగాయలు కొనలేకపోతున్నాం. కర్రీ పాయింట్లకు వెళ్లి కూరలు తెచ్చుకుంటున్నాం. ఎన్నడూ లేనంతగా కందిపప్పు, టమాటాల ధరలు పెరిగిపోయా యని అన్నారు.



శంకర కంటి ఆస్పత్రి సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-అచ్చంపేట

పేదలకు ఉచితంగా నేత్రవైద్యం అందించడం చాలా గొప్ప విషయమని స్థానిక శాసనసభ్యులు నంబూరు శంకర రావు అన్నారు. ఆదివారం అచ్చంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరనలో నూతలపాటి హనుమయ్య ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు కంటి వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల కోసం శంకర కంటి ఆస్పత్రి వారు చేస్తున్న సేవలు ఎంతోమందికి ఆదర్శమన్నారు. ఆస్ప తులకు వేళ్లి ఖరదైన చికిత్సలుచేయించుకోలేని వాళ్ల శంకర ఆస్పత్రి వారి వైద్యశిబిరాలను వినియోగించుకోవాలని సూచించారు. గత 25 సంవత్సరములుగా నియోజక వర్గంలో పలుచోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్న హనుమయ్య సేవా కార్యక్రమాలను అభినందించారు.రాష్ట్ర ప్రభుత్వం పేదల వైద్యం కోసం వేల కోట్లు ఖర్చు చేస్తోం దన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కంబాల వీరబాబు ఎంపీపీ కృష్ణ నాయక్ వైస్ ఎంపీపీ జి నరసింహారెడ్డి సొసైటీ అధ్యక్షులు రామిశెట్టి రంగయ్య జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు సాతర్ల శ్రీనివాసరావు వైసిపి నాయకులు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరం అభినందనీయం

యార్డు చైర్మన్ వెలిదండి గోపాల్

ప్రజాశక్తి - మాచర్ల

శ్రీకష్ణ జనరల్ హాస్పిటల్ మాచర్లవారి ఆధ్వర్యంలో దుర్గి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయటం అభినందనీయమని మార్కెట్ యార్డ్ చైర్మన్ వెలదండి గోపాల్ అన్నారు జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ మన ప్రాంతం నుండి వైద్య విద్యను అభ్యసించిన యువకులు ఈ ప్రాంతాల్లోనే డాక్టర్లు గా రావడం హర్ష నీయం అన్నారు. ఉచిత వైద్య శిబిరానికి అధిక సంఖ్యలో ప్రజలు రావడంతో వారికి అవసరమైన బీపీ షుగర్ తదితరు వైద్య పరీక్షలు డాక్టర్ గుర్రం రాజశేఖర్ రెడ్డి డాక్టర్ భూమిరెడ్డి స్వాతిలు నిర్వహించారు దాదాపు 300 మంది కి పరీక్షలు నిర్వ హించారు ప్రస్తుత సీజన్లో వచ్చే సీజనల్ వ్యాధులు వాటి నుండి తీసుకోవాల్సిన జాగ్రత్తలు పై ప్రజలకు డాక్టర్ల అవ గాహన కల్పించారు. హాస్పిటల్ మేనేజర్ ఎ.శ్రీనివాసరావు దుర్గి ఎంపిపి షేక్ నాగూర్ భాష తదితరులు పాల్గొన్నారు.

అమరేశ్వరునికి లక్ష బిల్వార్చన

ప్రజాశక్తి-అమరావతి

అమరావతిలోని శ్రీ బాలా చాముండికా సమేత అమరేశ్వరునికి ఆదివారం మాస శివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయ వేద పండితుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. అమరేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. కాకినాడకు చెందిన బుచ్చి వెంకట శాస్త్రి, నాగమణి దంపతులు స్వామివారికి లక్ష బిల్వార్చన నిర్వహించారు. అన్నదానానికి 22 వేల 519 రూపాయలు విరాళం వచ్చినట్లు ఆలయ అధికారి వి. గోపి తెలిపారు.

చింతల్ తండాలో 'జలకళ'ను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-విజయపురిసౌత్

మాచర్ల మండలం చింతలతండ గ్రామంలో మాచర్ల శాసనసభ్యులు ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వైయస్సార్ జలకళ పథకం ద్వారా రైతు పొలాలలో బోర్లకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల పక్షపాతి, రైతుల మేలుకోరే, అలాగే రైతులకు అండగా ఉండే ప్రభుత్వం వైసిపి ప్రభుత్వమని, పేద రైతులు వ్యవసాయం చేయుటకు వర్షాలపైన ఆధారపడకుండా పంట పండించే విధంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్టు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు శేరెడ్డి గోపిరెడ్డి, మాచర్ల జడ్పిటిసి మల్లు స్వామి, మాచర్ల మండల వైసీపీ నాయకులు బూడిద శ్రీను, మాచర్ల మండలం వాలంటీర్ల చైర్మన్ వీరారెడ్డి,శెరెడ్డి చింతల తండా సర్పంచ్ కేతావత్ శీను నాయక్, ఎంపీటీసీ సీత నాయక్ పాల్గొన్నారు.



బోర్లకు కొబ్బరికాయ కొట్టి ప్రారంబిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి



ధ్రువీకరణ పత్రాల పంపిణీ

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

జగనన్న సురక్షతో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి అన్నారు. నరసరావుపేట పట్టణంలోని 24వ వార్డ్ ప్రశాంత్ నగర్ పరిధిలోని సచివాలయంలో ఆది వారం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా పర్య టించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ వార్డులో రూ.8.30 కోట్లతో సంక్షేమ పథకాలు ద్వారా లబ్ధిదారులకు అందజేశామని రూ 2.51 కోట్ల తో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్ట్ లు, మన బడి ద్వారా నాడుబినేడు, బీసీ కమ్యూనిటీ హాల్, గడప గడప ద్వారా అభివృద్ధి చేశా మన్నారు. అనంతరం దరఖాస్తు చేసుకున్న వివిధ అర్జీలను తక్షణమే పరిశీలించి అర్హత కలిగిన ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు.

ప్రజలు ఎన్నుకోని వ్యక్తులు ప్రజాప్రతినిధులా?

ప్రజాశక్తి-విజయపురిసౌత్

ప్రజలు ఎన్నుకోకుండానే స్థానిక ఎన్నికల్లో దౌర్జన్యం గా ఎన్నికైన వ్యక్తులు ప్రజా ప్రతినిధులుగా చలామణి అవుతున్నారని తెలుగుదేశం పార్టీ మాచర్ల మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్ అన్నారు.ఆదివారం విజయపురిసౌత్ లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వీరాస్వామి మాట్లాడుతూ మాచర్ల నియోజకవర్గంలో సర్పంచులు,ఎంపీటీసీ లు ప్రజల మద్దతు లేకుండానే అక్రమంగా ఎన్నికై నేడు నీతి వాక్యాలు వల్లిస్తున్నారన్నారు.జూలకంటి బ్రహ్మారెడ్డి గురించి స్థాయి మరచి మాట్లాడుతున్నారని విమర్శించారు. బ్రహ్మా రెడ్డి కి భయపడి టిడిపి కార్యకర్తలపై అక్రమ కేసులు బనా యించి, భయపెట్టి దౌర్జన్యంగా వైసీపీ కండువాలు వేస్తున్నారని విమర్శించారు. వైసీపీ కే ఓటు వేయాలని అమాయకులతో దేవుడి గుడుల్లో ప్రమాణం చేయించడం దుర్మార్గమన్నారు.వైసిపి ప్రభుత్వాన్ని పాలకులు నడపడం లేదని పోలీసులే నడిపిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు బొల్లా వెంక టేశ్వర్లు చౌదరి,ఎరిపల్లి వెంకటేశ్వర్లు,చెల్లూరి అప్పలరాజు, కట్టా రాజు,రమావత్ స్వామి నాయక్,పవన్,రామ్ చంద్,గోసల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న టిడిపి నాయకులు

తాత్వికత కవిత్వానికి భూమిక

ప్రజాశక్తి-గుంటూరు

తాత్వికత కవిత్వానికి భూమిక అని ప్రముఖ సాహితీ వేత్త అబ్దుల్ రజా హుస్సేన్ తెలిపారు ఆదివారం స్థానిక బ్రాడీపేట సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో అమరావతి సాహితీ మిత్రులు నిర్వహించిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పైగంబర కవిత్వ ఉద్యమ నిర్మాతగా పేరుగాంచిన ఎం.కె.సుగంబాబు లఘు కవితా కావ్యం 'కాంతిధార'ను ఆయన ఆవిష్కరించి ప్రసంగించారు. 'రెక్కలు' లఘు కవితా ప్రక్రియ సృష్టికర్తగా మన్ననలు పొందిన సుగంబాబు రాసిన 'కాంతి ధార' కావ్యంలో తాత్వికత పరిమళిస్తుందని తెలియజేశారు. తాత్వికత సామాజిక తాత్వికతగా మారే చక్కని కవిత్వం రాసినందుకు కవిని ప్రశంసించారు. అమరావతి సాహితీ మిత్రులు సంస్థ అధ్యక్షులు డాక్టర్ రావి రంగారావు, డాక్టర్ చింతలపాటి మోహన మురళీ కష్ణ రాసిన 'సిరి దివ్వెలు' కావ్యంలోని వర్ణనల గురించి మాట్లాడారు. సభలో సాంధ్యశ్రీ రచించిన 'ది సాంగ్ ఆఫ్ మై లైఫ్' పుస్తకాన్ని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. సుగంబాబు రచన 'కాంతి ధార'ను ప్రముఖ కవయిత్రి తుమ్మల స్నిగ్ధ మాధవి సమీక్షించారు. సంజీవదేవ్ సాహిత్యం గురించి ఎన్నార్ తపస్వి సోదాహరణంగా ప్రసంగించారు. 'ఈ మాసం కవి'గా ప్రముఖ గాయకులు ఆల్లక తాతారావు (మంగళగిరి) పాల్గొని వివిధ అంశాల మీద వినిపించిన గేయాలు ఆకట్టుకున్నాయి. తాతారావును ఎస్‌హెచ్ఒ వ్యవస్థాపకులు డాక్టర్ టి.సేవాకుమార్, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ల ప్రతినిధి నూతలపాటి తిరుపతయ్య సన్మానించారు. అనంతరం పింగళి భాగ్యలక్ష్మి నిర్వహించిన కవి సమ్మేళనంలో పలువురు కవులు పాల్గొన్నారు.



ల్యాప్‌టాప్ అందజేత

ప్రజాశక్తి-పెదకూరపాడు

తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పెదకూరపాడుకు చెందిన గోగులపాటి షైనీకి చదువు నిమిత్తం ల్యాప్‌టాప్‌ను ఆదివారం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ సూచన, సహకారంతో ఎన్నారై మాగులూరి భాను ప్రకాష్,మండల టీడీపీ అధ్యక్షులు అర్తిమళ్ళ రమేష్, నరసరావుపేట పార్లమెంట్ డాక్టర్ సెల్ కార్యదర్శి గుడిపూడి చిన్నరాజు,తెలుగు యువత నాయకులు మేదరమెట్ల సౌమిత్,త్రిశక్తి పీఠం ఆలయ శాశ్వత ధర్మకర్త పొట్టి నాగమల్లేశ్వరరావు లు సమకూర్చి అందజేశారు.

లంక భూముల సాగుదార్లకు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి - దుగ్గిరాల

అనేక సంవత్సరాలుగా లంక భూములు సాగు చేసుకుంటున్న రైతులకు వెంటనే పట్టాలివ్వాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మండలంలోని పెదకొండూరులో లంక భూముల రైతుల సమావేశం దాసరి విజయలక్ష్మి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ లంక భూములు సాగు చేసుకుంటున్నా వారికి పట్టాలి ఇవ్వకపోవడంతో అనేకమందికి వారి భూములు ఆన్లైన్లో కనబడటం లేదని, పాస్ బుక్కులు పొందలేకపోయారని చెప్పారు. దీనివల్ల పంట రుణాలు పొందలేక వ్యవసాయంలో అధిక వడ్డీలకు ప్రైవేట్ రుణాలు తెచ్చుకొని చితికి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చాలామందికి ఈ-క్రాప్ బుకింగ్ కూడా చేయడం లేదని, ప్రభుత్వం కల్పించే రాయితీలకు, సబ్సిడీలకు దూరమయ్యారని తెలిపారు. లంక భూములు ప్రస్తుతం ఎవరు సాగు చేస్తున్నారో సర్వే చేసి వారికి వెంటనే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షులు మన్నవ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ అనేక కష్టాలకోర్చి లంక భూములు సాగు చేసుకుంటున్నా వారికి రాయితీలు, ప్రోత్సాహకాలు, పథకాలు దక్కడం లేదని తెలిపారు. వెంటనే పట్టాలివ్వకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జె.బాలరాజు మాట్లాడుతూ దుగ్గిరాల మండలంలోని అనేక గ్రామాల్లో లంక భూముల రైతులు ఇవే సమస్యలను ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. సమావేశంలో కౌలురైతు సంఘం మండల అధ్యక్షులు బి.అమ్మిరెడ్డి, ఎం.గోపి, లంక భూముల రైతులు పి.నాంచారయ్య, పి.దయాసాగర్, వి.బాబు, ఆర్.పాములు, ఎం.పుట్లమ్మ, కె.వెంకటేశ్వరరావు, టి.సత్యనారాయణ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బైరగాని శ్రీనివాసరావు

జగన్‌కు ఓటమి భయం : దేగల ప్రభాకర్

ప్రజాశక్తి - గుంటూరు



రాష్ట్రవ్యాప్తంగా లక్షల సంఖ్యలో తమ పార్టీకి చెందిన సానుభూతిపరులు, కార్యకర్తల ఓట్లు తొలగిస్తున్నారని టిడిపి గుంటూరు నగర అధ్యక్షులు దేగల ప్రభాకర్ ఆరోపించారు. టిడిపి నగర కార్యాలయంలో ఆదివారం ఆయ విలేకర్లతో మాట్లాడారు. ప్రజాస్వామ్యానికి దిక్సూచి అయిన ఓటు హక్కును తొలగిస్తూ, ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలకు జగన్ ప్రభుత్వం పాల్పడుతోందని, ఓటర్ల జాబితా ప్రక్షాళన పేరుతో రాష్ట్రంలో లక్షల సంఖ్యలో టిడిపి సానుభూతిపరుల ఓట్లు తొలగిస్తున్నారఇ విమర్శించారు. ఇటీవల ఎన్నికల సంఘం విడుదల చేసిన జాబితా ప్రకారం రాష్ట్రంలో ఇప్పటికే దాదాపు పది లక్షల ఓట్లు తొలగించినట్లు పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో ఓటమి భయంతోనే ఓట్ల తొలగింపు చేపట్టారన్నారు. ఓటర్లకు కనీసం నోటీసు కూడా ఇవ్వకుండా వాలంటీర్ల ద్వారా ఇష్టానుసారంగా ఓట్లు తొలగిస్తున్నారని మండిపడ్డారు. అధికార పార్టీకి అనుకూలంగా ఉండే ఓట్లు మాత్రం ఎక్కడా కూడా తొలగించడం లేదన్నారు. కొంతమంది బూత్ స్థాయి అధికారులు వైసిపి నాయకులతో కుమ్మక్కై వాలంటీర్ల సహకారంతో పెద్ద ఎత్తున ఓట్లు తొలగిస్తున్నారన్నారు. దొంగ ఓట్ల నమోదు, ఓట్లు తీసివేతలపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను ఇటీవల కేంద్ర ఎన్నికల కమిషన్ ఢిల్లీకి పిలిచి చివాట్లు పెట్టారంటే సమస్య తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. ఓటు హక్కును పౌరులకు లేకుండా చేస్తున్న దోషులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, జగన్‌కు ప్రజాస్వామ్యంపై ఏమాత్రం గౌరవం ఉన్న మార్గంలో గెలవాలనే ఆలోచనలు విడిచిపెట్టి పారదర్శకంగా ఎన్నికలు సిద్ధపడాలని కోరారు.

శ్మశానంలో రూ.3 కోట్లతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - గుంటూరు

స్థానిక శ్రీనివాసరావుపేటలోని శ్మాశానంలో రూ.3 కోట్ల అభివృద్ధి పనులకు మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయడు, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌రావు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18, 19, 20, 21, 22 డివిజన్లకు అనుసందనంగా ఉన్న ఈ శ్మశాన వాటికలో రూ.1.30 లక్షలతో గ్యాస్ ఇంటోరియం ఏర్పాటు చేస్తున్నామని, 1.70 లక్షలతో టాయిలెట్స్, రెస్ట్ రూమ్స్, 11 రోజుల నిద్రకు వచ్చేవారికి వసతి గృహాలు, భోజన శాలలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. డివిజన్లో తమ దృష్టికి వచ్చిన ఇతర డ్రెయినేజీ, రోడ్లు, తాగునీరు తదితర సమస్యలనూ పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో 18, 19, 21, 22 డివిజన్ల కార్పొరేటర్లు ఎన్.వెంకట రమణ, టి.హనుమాయమ్మ యోగేశ్వరరావు, కె.గురవయ్య, జి.రమేష్ పాల్గొన్నారు.



ట్రాఫిక్, ముంపు సమస్యల్లేకుండా విస్తరణ

80 అడుగుల రోడ్డుగా ఏటి అగ్రహార ప్రధాన రహదారి పనులు : కార్పొరేటర్ వెంకటరెడ్డి

ప్రజాశక్తి - గుంటూరు



ఏటి అగ్రహారం మెయిన్ రోడ్డు ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు 30వ డివిజన్ కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డి తెలిపారు. వర్షం వచ్చిందంటే ఏటి అగ్రహారం మెయిన్ రోడ్డు మునిగి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేదని, కాకుండా అంతే కాకుండా స్థానిక దుకాణాలన్నీ ముంపుబారిన పడేవని, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడేవారని తెలిపారు. వీటన్నింటినీ గుర్తించి నగరపాలక సంస్థ మాస్టర్ ప్లాన్ ప్రకారం మెయిన్ రోడ్డును జీరో లైన్ నుంచి చుట్టగుంట సెంటర్ వరకు 80 అడుగుల రోడ్డుగా విస్తరణ చేపట్టినట్టు తెలిపారు. ఇందు గాను 207 మందికి సంబంధించిన ఇళ్ల తొలగించాల్సి వచ్చిందని, వారందరికీ నష్టపరిహారంగా సుమారు రూ.ఏడు కోట్ల బాండ్లు మంజూరు చేశామని తెలిపారు. ఇప్పటికే రోడ్డుకు ఇరువైపునా ఉన్న కరెంటు స్తంభాలను తొలగించామని, సైడ్ కాల్వల నిర్మాణం 80 శాతం పూర్తయిందని చెప్పారు. 30వ డివిజన్‌లోని హనుమన్ నగర్, శ్రీరామ్ నగర్‌లో సుమారు 8 కోట్లతో సిసి డ్రెయిన్లు, కాల్వల నిర్మాణం పూర్తయినట్లు తెలిపారు. మరికొన్ని పనులు పూరోగతిలో ఉన్నాయని, కొత్తగా డివిజన్‌కు రూ.రెండు కోట్లు మంజూరయ్యాయని వివరించారు. తాగునీటి పైపులైన్లు పనులకు టెండర్లు పిలిచామన్నారు. ఈ అన్ని అభివృద్ధి పనులకూ స్థానికుల నుండి మంచి సహకారం అందుతోందని చెప్పారు.


80 అడుగుల రోడ్డుగా విస్తరించనున్న ప్రధాన రహదారి

పొన్నూరులో త్వరలోనే ఆటోనగర్ నిర్మాణం : ఎమ్మెల్యే రోశయ్య

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్ : పొన్నూరు పట్టణంలో ఆటోనగర్ నిర్మాణం త్వరలో చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య చెప్పారు. ఆటోనగర్ వెల్ఫేర్ అసోసియేషన్స్ సమావేశంలో ఆదివారం పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆటోనగర్ నిర్మాణానికి అన్ని అనుమతులు వచ్చాయని చెప్పారు. ఇది నిర్మితమైతే వేలాది మంది కార్మికులకు ఉపయోగంతోపాటు పట్టణం అభివద్ధి చెందుతుందని అన్నారు.



మహిళలకు న్యాయ సహాయంపై అవగాహన

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

మహిళలకు చట్టాల పట్ల అవగాహన అవసరమని కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీ లా కళాశాల విభాగాధిపతి జి.విజయ సుధ అన్నారు. ఎస్‌డిసి భవనంలోని మూట్ కోర్టు హాలులో ఆదివారం జరిగిన అవగాహనా సదస్సులో ఆమె మాట్లాడుతూ మహిళల హక్కుల గురించి, చట్టాల పట్ల వారికి అవగాహన కల్పించేందుకు కెఎల్‌యులోని న్యాయ కళాశాల అధ్యాపకులతో పాటు కెఎల్ మహిళా ఫోరం ముందుంటుందన్నారు. మహిళల్లో చట్టపరమైన అవగాహన, సాధికారతను పెంపొందించడం, చట్టపరమైన సహాయ సేవల గురించి అవగాహన కల్పించినట్లు తెలిపారు. స్త్రీల హక్కుల పరిరక్షణలో మరింతగా లింగ సమానత్వాన్ని సాధించడంలో న్యాయ సహాయం యొక్క ప్రాముఖ్యత గురించి చర్చించామన్నారు. విశిష్ట వక్త మహిళా ఫోరం సభ్యురాలు డాక్టర్ కె.రూత్‌రమ్య మహిళలకు అందుబాటులో ఉన్న న్యాయ సహాయ సేవలు, న్యాయ సహాయాన్ని పొందడంలో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లు, లింగ-ఆధారిత హింసను పరిష్కరించడంలో న్యాయ సహాయం పాత్ర, మహిళల్లో చట్టపరమైన అవగాహన మరియు సాధికారతను పెంపొందించే వ్యూహాలు తదితర అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారథివర్మ, ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, అధ్యాపకులు శైలజ పాల్గొన్నారు.



కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు ద్వారా బహుముఖంగా రుణాలు

ప్రజాశక్తి - మంగళగిరి



పట్టణంలోని గౌతమ్‌బుద్ధ రోడ్‌లోని టిప్పర్ల బజార్ వద్ద గల కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ పలు రకాల రుణాలు అందజేస్తున్నట్లు బ్యాంక్ మేనేజర్ జి.మమత తెలిపారు. ఎంఎస్ఎంఇ పరిశ్రమలకు, సేవా సంస్థలకు రుణ సౌకర్యం ఉందన్నారు. ప్రతి చిన్న, మధ్యతరహా, భారీ పరిశ్రమలకు వెంటనే రుణాలు ఇస్తామని, స్థిరాస్తి హామీపై అన్ని అవసరాలకు, వ్యాపార అభివృద్ధి, పెళ్లిళ్లకు, చిన్న చిన్న సంస్థల నిర్వహణకు రుణాలు మంజూరు చేస్తామని చెప్పారు. గృహ నిర్మాణం, అపార్ట్‌మెంట్ కొనుగోలు, నిర్మాణం, మరమ్మతుల కోసం హోం లోన్స్ ఇస్తామన్నారు. చదువు కోసం విదేశాలకు వెళ్లేవారికి స్థిరాస్తి హామీపై 50 లక్షల వరకు రుణం ఇస్తామని, కారు కొనుగోలుకు వెంటనే రుణ సౌకర్యం ఉందని చెప్పారు. ఓవర్ డ్రాఫ్ట్, క్యాష్ క్రెడిట్ రుణ సౌకర్యం ఉందన్నారు. బంగారం నగల హామీపై తక్షణం రుణం ఇస్తామని, ఈ అవకాశాలను ప్రజలు, ఖాతాదార్లు ఉపయోగించుకోవాలని కోరారు.

అమర్‌నాథ్ కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేసేదెప్పుడు? : టిడిపి

ప్రజాశక్తి - మంగళగిరి

టిడిపి గౌడ సంఘీయులు ఆత్మీయ సమావేశం మంగళగిరి పట్టణ అధ్యక్షులు వాకా మాధవరావు అధ్యక్షతన స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం జరిగింది. నాయకులు మాట్లాడుతూ బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గం ఉప్పలవారిపాలెంలో గౌడ సామాజిక తరగతికి చెందిన అమర్నాథ్ గౌడ్‌ను అధికార పార్టీ రౌడీ మూకలు అత్యంత పాశవికంగా పెట్రోల్ పోసి కాల్చి చంపారని, బాధితులకు న్యాయం చేయకుండా ప్రభుత్వం తప్పించుకుంటోందని విమర్శించారు. ఘటన జరిగి నెల రోజులైనా నిందితులకు శిక్ష పడలేదని, అమర్నాథ్ కుటుంబానికి ఎప్పుడు న్యాయం చేస్తారో సిఎం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు గౌడలంతా ఏకం కావాలన్నారు. సమావేశంలో వి.మంగరావు, టి.కోటయ్య, వై.కోటేశ్వరరావు, కె.శివప్రసాద్, కె.రంగారావు, జి.బాలాజీ పాల్గొన్నారు.

18 మంది విద్యార్థినులకు రోటరీ క్లబ్ సైకిళ్లు

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్

పెదనందిపాడు ప్రాంతంలో పేదలకు రోటరీ క్లబ్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని రోటరీ డీజీఎన్ డాక్టర్ ఎస్.వి.రాం ప్రసాద్ అన్నారు. ఆదివారం పెదనందిపాడులో రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారంలో ఆయన మాట్లాడుతూ రోటరీ క్లబ్‌లో మహిళలను సభ్యులుగా చేర్చుకొని వారి సేవలు కూడా వినియోగించాలన్నారు. అనంతరం స్థానిక జెడ్పీ పాఠశాల, అన్నపర్రు జెడ్పీ పాఠశాలకు చెందిన 18 మంది విద్యార్థినులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సైకిళ్లు పంపిణీ చేశారు. తొలుత నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ముద్దన రాఘవయ్య సహకారంతో ఇద్దరు మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. కార్యక్రమాల్లో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ వై.వేణుగోపాల్, మలినేని ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మన్ మలినేని పెరుమాళ్లు, క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వై.కోదండరామిరెడ్డి, వై.రమణయ్య, కోశాధికారి ఎన్‌విఎస్ నాగేశ్వరరావు, విక్టర్ జాన్‌పాల్, లక్ష్మీనారాయణ, వీరయ్య చౌదరి, సాంబశివరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న రోటరీ బృందం



పోటీలు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే, క్రీడాకారులు, కోచ్‌లు

తెనాలిలో రాష్ట్రస్థాయి షటిల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక చెంచుపేట అమరావతి ప్లాట్స్‌లోని అన్నాబత్తుని సత్యనారాయణ ఇండోర్ స్టేడియంలో స్టేడియం స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక వ్యాయామానికి దోహదం చేస్తాయని, క్రీడాకారులు పోటీతత్వం కలిగి, క్రీడా స్ఫూర్తితో రాణించాలన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు తెనాలి వేదిక కావటం ఈ ప్రాంతానికే గర్వకారణమన్నారు. కార్యక్రమంలో స్టేడియం స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ మునగాల మోహనశ్యామ్ ప్రసాద్, మేనేజర్ కృష్ణప్రసాద్, కౌన్సిలర్లు జి.సాయిహరేరామ్, దుబాయ్‌బాబు, నాయకులు సునీల్, ఎ.సాంబశివరావు పాల్గొన్నారు.

ఓట్ల రాజకీయం ప్రారంభం

- జాబితాలపై ప్రధాన పార్టీల దృష్టి
- సవరణలపై 21 నుంచి సమగ్ర పరిశీలన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితాలపై అన్ని రాజకీయ పార్టీలు దృష్టి సారించాయి. ఎన్నికల్లో గెలుపునకు సర్వశక్తులు ఒడ్డుతున్న ప్రధాన రాజకీయ పార్టీలు ఓటర్ల జాబితాలపై నిశిత పరిశీలన చేయనున్నారు. గుంటూరు, నర్సరావుపేట లోక్‌సభ స్థానాల్లోని 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈనెల 21 వతేదీనుంచి ప్రారంభం కాబోతున్న 'ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ'పై ప్రత్యేక దృష్టి సారించాయి. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఇప్పటికే టిడిపి,వైసిపి, జనసేన, వామపక్షాలు, బిజెపి కూడా నిశితపరిశీలన చేస్తున్నాయి. ఓటర్ల వివరాలతోపాటు అవకాశం ఉన్న చోట్ల వారి ఫోన్ నంబర్లు కూడా ప్రధాన రాజకీయ పార్టీల కార్యకర్తలు సేకరిస్తున్నట్టు తెలిసింది.

ఓటర్ల జాబితాల సవరణ నేపథ్యంలో ఈ అంశంపై సోమవారం గుంటూరులో మూడు జిల్లాల ఎమ్మెల్యేలతో వైసిపి ప్రాంతీయ కార్యాలయంలో ఆపార్టీ నాయకులు సమావేశాన్ని ఏర్పాటు చేశాయి. పార్టీ యంత్రాంగం క్రియాశీలకంగా వ్యవహరించేలా ఎమ్మెల్యేలు, కో-ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులు, పరిశీలకులు బాధ్యతతో పని చేయాలని పార్టీ అధిష్టానం ఎమ్మెల్యేలు, ఎంపీలకు సూచించింది. దొంగఓట్ల తొలగింపు, అర్హులైన వారిని ఓటర్లుగా చేర్చే విషయంలో కీలకంగా వ్యవహరించాలని వైసిపి పార్టీ శ్రేణులను కోరింది. పార్టీ బూత్ కమిటీల ఇన్‌ఛార్జులు, గృహసారధులతో జాబితాల పరిశీలన చేయనున్నారు.

మరోవైపు టిడిపి ఇప్పటికే ఓటర్ల జాబితాలపైమొదటి విడత కసరత్తు పూర్తి చేసింది. పార్టీ కార్యకర్తలతో కలిసి క్లస్టరు ఇన్‌ఛార్జిలు, గ్రామ,వార్డు స్థాయి నాయకులు ఇంటింటికి వెళ్లి పరిశీలన చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో బోగస్ ఓటర్లను గుర్తించారు. గుంటూరు నల్లచెరువు ప్రాంతంలో ఒకే డోర్ నంబరుపై 200పైగా ఓటర్లు ఉన్నారని టిడిపి ఫిర్యాదు చేయగా అధికారులు పరిశీలన చేసి 2019 ముందు నుంచి ఒకే డోర్ నెంబరుపై వీరంతా ఉన్నారని వీరు బోగస్ ఓటర్లు కాదని నగర అదనపు కమిషనర్ పెద్దిరోజా ప్రకటించారు. అయినా వీరంతా బోగస్ ఓటర్లనేని టిడిపి కార్పొరేటర్లు వాదిస్తున్నారు. ఇలాంటి బోగస్ ఓటర్ల వల్లే తాను ఓడిపోయాయని ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం వాపోయారు. అయినా వీరిని తొలగించడానికి మాత్రం అధికారులు సుముఖత చూపలేదు.

ఇప్పటికే టిడిపి గ్రామ స్థాయి నాయకులు బోగస్ ఓటర్లను, స్థానికంగా నివశించని వారిని, చనిపోయిన వారిని తొలగించాలని అధికారులకు పోలింగ్ బూత్ స్థాయిలోనే వినతి పత్రాలు అందచేసింది. దీంతో అధికారపక్షం అప్రమత్తం అయింది. వాలంటీర్లను ఉపయోగించి తమ పార్టీ ఓటర్ల తొలగిస్తున్నారని, చనిపోయిన ఓటర్లను కొనసాగిస్తున్నారని టిడిపి ఆరోపించింది. దీంతో ఈసారి వాలంటీర్ల స్థానంలో వైసిపి నియమించిన గృహ సారధులను క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితాలను పరిశీలించేందుకు బాధ్యతలు అప్పగించారు. జనసేన కూడా తమకు పట్టు ఉన్న నియోజకవర్గాలో ఓటర్లజాబితాలపై దృష్టి సారించింది. ప్రధానంగా తెనాలి, గుంటూరు తూర్పు, పశ్చిమ, సత్తెనపల్లి, నర్సరావుపేట, గురజాల తదితర నియోజకవర్గాలపై ఆపార్టీ దృష్టి సారించింది. అంతేగాక జనసేన, టిడిపి పొత్తు ఉండే అవకాశం ఉండటంతో తమ పార్టీ ఓటర్లను అధికారపార్టీ తొలగించే అవకాశం ఉండటంతో అన్ని నియోజకవర్గాల్లో తమ ఓటర్లను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తామని ఆపార్టీ జిల్లా నాయకులు తెలిపారు.



ఓటరు దరఖాస్తు స్వీకరణలో యంత్రాంగం (ఫైల్)

విద్యా ప్రమాణాల కోసం ప్రణాళిక



- పదో తరగతిలో ఉత్తమ ఫలితాల కోసం ప్రత్యేక దృష్టి
- నెలలోపు నాడు-నేడు పనుల పూర్తి
- ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలల్లో ఫీజు దోపిడీపై ఆధారాలు సహా ఫిర్యాదులొస్తే కఠిన చర్యలు
- ప్రజాశక్తితో పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్

ఇంటర్వ్యూ

ప్రభుత్వ విద్య బలోపేతానికి తీసుకుంటున్న చర్యలేమిటి?

ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతానికి విద్యాశాఖ అనేక చర్యలు చేపట్టింది. నాడు-నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పిస్తున్నాం. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు తరగతి గదుల నిర్మాణం, మినరల్ వాటర్ సదుపాయం, మరుగుదొడ్లు వంటివి ఏర్పాటు చేస్తున్నాం. జగనన్న విద్యా కానుక (జెవికె) కిట్ కింద పుస్తకాలు, బ్యాగ్, బూట్లు, యూనిఫాం అందిస్తోంది. గోరుముద్ద పథకం కింద పోషకాహారం అందిస్తోంది. ఇవన్నీ తల్లిదండ్రులు గుర్తించాలి. తమ పిల్లల్ని ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలల్లో చేర్పించి ఫీజుల దోపిడీకి గురికాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి.

నాడు-నేడు పనుల పురోగతి ఎలా ఉంది?

నాడు-నేడు మొదటి విడత 100 శాతం పూర్తయ్యింది. రెండో విడత కింద ఎంపిక చేసిన 547 ప్రభుత్వ పాఠశాలల్లో పనులు చివరి దశకు చేరుకున్నాయి. 20 నుండి 30 రోజుల్లోపు ఆ పనులన్నీ నూరుశాతం పూర్తవుతాయి. వీటికి సంబంధించి సంబంధిత అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా 174 పాఠశాలల్లో 746 అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎలా ఉంది?

పల్నాడు జిల్లాలో ఉన్న వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో 2,97,567 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో 9,607 మంది కెజివిబి, మోడల్ స్కూల్‌లో ఉండగా జెడ్‌పి హైస్కూల్స్, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 1,28,765 మంది ఉన్నారు. వీరిలో బాలికలు 66,038 మంది ఉండగా బాలురు 62,727 మంది ఉన్నారు. ప్రయివేటు ఎయిడెడ్, కేంద్రీయ విద్యాలయ, నవోదయ, మదర్సా, బిసి ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పాఠశాలల్లో 1,37,732 మంది చదువుతున్నారు.

కెజిబివి, మోడల్ స్కూల్‌లో చేరికలు, పని తీరు ఎలా ఉంది?



ఆయా పాఠశాలల్లో సీట్లు 100 శాతం భర్తీ అయ్యాయి. పల్నాడు జిల్లాలో కస్తూర్బా గాంధీ బాలికల వసతిగృహాలు 24 ఉండగా అందులో 4325 మంది బాలికలు ఉండగా అదేవిధంగా మోడల్ స్కూల్‌లో 5282 మంది విద్యనభ్యసిస్తున్నారు. కెజిబివిలలో ఇటీవల 98 అధ్యాపకుల పోస్టులను భర్తీ చేశాం. 6వ తరగతి 12వ తరగతి వరకు ఉపాధ్యాయులను నియమించి కొరతను అధిగమించాం.

పాఠ్యపుస్తకాలు పూర్తిగా అందలేదనే విమర్శలున్నాయి కదా?

మొదటి విడత పుస్తకాలను 100 శాతం పంపిణీ చేశాం. 2వ విడత పుస్తకాలను ఈ నెల 18 వ తేదీ నాటికి పాఠశాలలకు చేరుస్తాం. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఈ నెల 22న పుస్తక దినోత్సవం సందర్భంగా 4.85 లక్షల పుస్తకాలు పంపిణీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం.

జెవికె కిట్ల పంపిణీ ఎంత వరకు పూర్తయింది?

విద్యా కానుక కిట్లకు సంబంధించి 93.81 శాతం పూర్తి చేశాం. మిగతవావారికీ ఇచ్చినా కొలతలు సరిపోక రిటర్న్ పంపించాం. కాబట్టి 100 శాతం పిల్లలకు ఇచ్చినట్లు బయోమెట్రిక్ తీసుకున్నాం. రిటర్న్ పంపినవి రాగానే వాటినీ విద్యార్థులకు అందజేస్తాం.

గోరుముద్ద అమలు ఎలా ఉంది?

నిర్దేశించిన మెనూను తప్పనిసరిగా అమలయ్యేలా ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నాం. నిర్వాహకులకు ప్రతినెలా 6వ తేదీ లోగా బిల్లులు చెల్లిస్తున్నాం. గోరుముద్ద పథకంలో భాంగంగానే ఉదయం పూట రాగిజావను అందిస్తున్నాం. పథకం అమలులో లోపాలున్నా, ఫిర్యాదులు వచ్చినా సహించబోం. తప్పులుంటే కఠిన చర్యలు తీసుకుంటాం..

ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల నిర్వహణపై పరిశీలన?

ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తాం. నిబంధనలు పాటించని యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటాం. పుస్తకాలను అధిక ధరల అమ్మడంపైన, ఫీజుల అధికంగా వసూలు చేయడంపైన ఆధారాలు సహా తమను ఎవరైనా సంప్రదిస్తే ఆయా పాఠశాలల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఆయా సంస్థలు సైతం ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ జిల్లాలో విద్యాభివృద్ధికి తమ వంతు పాత్ర పోషించాలి. పిల్లలను బస్సుల్లో పాఠశాలలకు తీసుకెళ్లే అంశంలో పాఠశాల యాజమాన్యం చాలా జాగ్రత్తగా ఉండాలి. డ్రైవర్లను అప్రమత్తంగా ఉంచుతూ ప్రమాదాల తావివ్వకుండా చూడాలి. ఓ ప్రైవేటు పాఠశాల బస్సు ఇటీవల ప్రమాదానికి గురైన నేపథ్యంలో రూ.2 లక్షలు జరిమానా విధించాం.

పేదలకు 25 శాతం ఉచిత విద్య అమలవుతోందా?

దీనికి సంబంధించి ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు దిశానిర్దేశం చేశాం. జిల్లా వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో 470 దరఖాస్తులు రాగా 200 మంది విద్యార్థులకు పైగా అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయింది. మిగిలిన వారికి కూడా ఈ వారంలో చేరికల ప్రక్రియ పూర్తి చేస్తాం.

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా



రేపు ఆశా వర్కర్ల 'చలో డిఎంహెచ్‌ఒ ఆఫీస్'

ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం 'చలో డిఎంహెచ్‌ఒ ఆఫీస్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వై.నేతాజీ, అధ్యక్ష, కార్యదర్శులు కె.లక్ష్మి, కె.జ్యోతి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన జారీ చేశారు. పనిభారం తగ్గింపు, ఆన్ లైన్ పని తగ్గింపు, నాణ్యమైన సెల్ ఫోన్లు, 4జి సిమ్స్, శిక్షణ ఇవ్వాలని, ప్రభుత్వ సెలవులు ఇవ్వాలని, సచివాలయాలు, సబ్ సెంటర్‌లలో డ్యూటీలు వేయరాదని, గ్రూప్ ఇన్సూరెన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సంక్షేమ పథకాల అమలు తదితర డిమాండ్లతో ఆందోళన చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి జిల్లాలోని ఆశా వర్కర్లు అందరూ యూనిఫాం ధరించి హాజరు కావాలని పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం 10 గంటలకు గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుండి ప్రదర్శన అనంతరం డిఎంహెచ్‌ఒ ఆఫీస్ వద్ద నిరసన ఉంటుదని తెలిపారు.

కలెక్టరేట్ వద్ద రేపు మహా ధర్నా

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకూ పొడిగించాలని కోరుతూ 18 రోజులుగా గుంటూరు కలెక్టరేట్ వద్ద చేస్తున్న నిరాహార దీక్షలకు మద్దతుగా మంగళవారం కలెక్టరేట్ వద్ద తలపెట్టిన మహాధర్నాలో పార్టీలకు అతీతంగా రైతులు, ప్రజలు పాల్గొనాలని నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం పెదనందిపాడు, నాగులపాడు గ్రామాల్లో ప్రచారం చేశారు. నల్లమడ రైతు సంఘం నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహనరావు, కొల్లా నిర్మల రామన్, చౌడేశ్వరి, సరళ, రమాదేవి, విజయకుమార్, అంకమ్మ చౌదరి, హరిప్రసాద్, మహమ్మద్ బాష పాల్గొన్నారు.



ప్రచారంలో మహిళలు, రైతులు, నాయకులు